


# ప్రజాస్ఫూర్తి

PRAJASPOORTHI TELUGU DAILY

తెలుగు దినపత్రిక

PS NEWS

మేడ్చల్ - మల్కాజిగిరి | ఎడిటర్ - గడ్డమీది బాలరాజు | ఆదివారం 19-04-2026 | సంపుటి - 27 | సంచిక -327 | రూ : 4 | పేజీలు: 8


## జూన్ 2 నుంచి ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం!

- ట్రాఫిక్ తగ్గించేందుకు రాష్ట్ర ప్రభుత్వ ప్రణాళిక
- ఏడాదిపాటు ప్రయోగాత్మకంగా అమలు చేస్తామంటూ.. ద.మ.రైల్వేకు లేఖ
- ముసాయిదా ఎంవోయూ పంపించాలని కోరిన రైల్వే

2లో






## ఉత్తర తెలంగాణలో పొలిటికల్ హీట్

- ఒకే రోజు రణరంగంలోకి సీఎం, మాజీ సీఎం!
- 20న జగిత్యాల వేదికగా బీఆర్ఎస్ 'ప్రజా ఆశీర్వాద సభ'
- గులాబీ గూటికి కాంగ్రెస్ మాజీ సీనియర్ నేత జీవన్ రెడ్డి
- దానికి కౌంటర్‌గా అదే రోజున మేడిగడ్డ బ్యారేజీకి సీఎం రేవంత్‌రెడ్డి
- నస్తూరుపల్లిలో కాంగ్రెస్ భారీ బహిరంగ సభ


కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి : భానుడి భగభగలను మించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలు రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఒకేరోజు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అధినేతలు తమ బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. తూర్పున కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను ఎండగట్టి గులాబీ పార్టీని ఇరుకున పెట్టేందుకు

తరువాయి 2లో

## హర్మ్యూజ్ మళ్లీ మూసివేత... ఇరాన్ సంచలన నిర్ణయం

- హర్మ్యూజ్ జలసంధిపై మళ్లీ కఠిన నియంత్రణ విధించిన ఇరాన్
- తెరిచిన రెండు రోజులకే ఆ మార్గాన్ని తిరిగి మూసివేస్తున్నట్లు ప్రకటన
- అమెరికా నేవీ దిగ్బంధనం కొనసాగించడమే కారణమని ఆరోపణ
- తాజా పరిణామాలతో మధ్యప్రాచ్యంలో మళ్లీ ఉద్రిక్తతలు
- ప్రపంచ ఆయిల్ సరఫరాపై ప్రభావం చూపే అవకాశం

2లో





## రన్‌వే క్లోజ్.. పూణెలో ప్రయాణికుల అవస్థలు!

- భారత వాయుసేన విమానానికి ప్రమాదం
- గంటల తరబడి నిలిచిపోయిన విమాన సర్వీసులు
- ఇండిగో, ఎయిర్ ఇండియా సహా పలు సంస్థల విమానాల రద్దు
- ప్రమాదం తర్వాత రన్‌వేను పునరుద్ధరించిన అధికారులు

2లో

## మహిళా బిల్లు పతనం.. విపక్షాలకు జీవితాంతం చింతే: మోదీ

2లో

- బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయన్న మోదీ
- విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని వ్యాఖ్య
- బిల్లుకు వ్యతిరేకంగా ఉండటమే కాకుండా సాకులు వెతుకుతున్నారన్న మోదీ



## బుధవారమే డెడ్‌లైన్.. ఒప్పందం కుదరకుంటే మళ్లీ

- డీల్ కుదరకుంటే మళ్లీ బాంబుల దాడులు తప్పవని హెచ్చరిక
- ట్రంప్ వాదనలు పూర్తిగా అబద్ధమని కొట్టిపారేసిన ఇరాన్
- యురేనియం నిల్వలను తరలించే ప్రసక్తే లేదని స్పష్టీకరణ

2లో





## రాజమండ్రి-విశాఖ మధ్య 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం.. కేంద్రం ఆమోదం

- ఏపీలో కీలక రైల్వే ప్రాజెక్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్
- రూ.9,889 కోట్లతో రాజమండ్రి-దువ్వాడ రైల్వే లైన్ల విస్తరణ
- తూర్పుగోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖ జిల్లాలకు ప్రయోజనం
- ఏపీ, యూపీలలో మొత్తం రూ.24,815 కోట్ల విలువైన ప్రాజెక్టులకు ఆమోదముద్ర
- అన్నవరం, అంతర్వేది వంటి పుణ్యక్షేత్రాలకు మెరుగవనున్న కనెక్టివిటీ


2లో

## అడిగినంత ఇస్తేనే అనుమతికి సిఫార్సు!

- ఆ ఆచార్యుడి బృందం వస్తే రూ.4 లక్షలు ముట్టజెప్పాల్సిందే..
- ఇంజినీరింగ్ కళాశాలల యజమానుల్లో దడ..
- జేఎన్‌టీయూహెచ్ తనిఖీల్లో అవినీతి పర్వం

హైదరాబాద్: రాష్ట్రంలో ఏటా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల తనిఖీల వ్యవహారం కొందరు జేఎన్‌టీయూహెచ్ ఆచార్యులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా వర్సిటీలో కీలక పదవిలో ఉన్న ఓ ఆచార్యుడు వస్తున్నారంటే కళాశాలల యజమానులు వణికిపోతున్నారు. ఆయనకు రూ.4 లక్షలు ముట్టజెప్పాల్సిందేనంటూ తలలు పట్టుకుంటున్నారు. ఇవ్వకుంటే కనీస నిబంధనలు పాటించడంలేదని, వసతులు

తరువాయి 2లో



# ఉత్తర తెలంగాణలో పొలిటికల్ హీట్

కరీంనగర్ ప్రాంతీయ ప్రతినిధి : భానుడి భగభగలను మించి ఉమ్మడి కరీంనగర్ జిల్లా రాజకీయాలు రణరంగాన్ని తలపిస్తున్నాయి. ఒకేరోజు అధికార, ప్రధాన ప్రతిపక్ష పార్టీల అధినేతలు తమ బలప్రదర్శనకు సిద్ధమవుతున్నారు. తూర్పున కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలను ఎండగట్టి గులాబీ పార్టీని ఇరుకున పెట్టేందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, పశ్చిమాన ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిస్తూ పార్టీ శ్రేణుల్లో ఉత్సాహం నింపేందుకు మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ ఒకేరోజు (ఈనెల 20న) పర్యటనలు ఖరారు చేసుకోవడం రాజకీయ ఉత్కంఠ రేపుతోంది. సీనియర్ నేత తాటిపర్తి జీవన్‌రెడ్డిని చేర్చుకోవడం ద్వారా జగిత్యాల నుంచి తమ పార్టీకి పూర్వవైభవం చాటాలని బీఆర్ఎస్ భావిస్తుండగా.. అదే రోజున మేడిగడ్డను అస్త్రంగా మలచుకుని కౌంటర్ అటాక్ చేయాలని అధికార కాంగ్రెస్ వ్యూహరచన చేస్తోంది.

**జగిత్యాల నుంచి 'గులాబీ' జైత్రయాత్ర!**

అసెంబ్లీ ఎన్నికల తర్వాత చాలా కాలంగా క్షేత్రస్థాయి బహిరంగ సభలకు దూరంగా ఉన్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. ఇప్పుడు నేరుగా జగిత్యాల వివేకానంద స్టేడియం వేదికగా జరగబోతున్న సభకు వస్తుండటం ఆ పార్టీ శ్రేణుల్లో నూతనోత్సాహాన్ని నింపుతోంది. కాంగ్రెస్ పార్టీలో సుదీర్ఘ కాలం పని చేసిన సీనియర్ నాయకుడు, మాజీ మంత్రి తాటిపర్తి జీవన్‌రెడ్డిని తమ వైపు తిప్పుకోవడంలో బీఆర్ఎస్ నాయకత్వం సఫలమైంది. దీన్ని కేవలం ఒక చేరికగా కాకుండా, కాంగ్రెస్ ప్రభుత్వ విధానాలపై వ్యతిరేకతగా ప్రతిబింబించే ప్రయత్నం చేస్తోంది. ఇందుకోసం 'ప్రజా ఆశీర్వాద సభ'ను ప్రతిష్టాత్మకంగా తీసుకున్న మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు వారం రోజులుగా నియోజకవర్గాల వారీగా ఇన్‌చార్జీలను నియమించి ఏర్పాట్లను పర్యవేక్షిస్తున్నారు. కేసీఆర్ ప్రసంగం ద్వారా రేవంత్ ప్రభుత్వ వైఫల్యాలపై తీవ్ర స్థాయిలో అటాక్ చేసేందుకు గులాబీ దళం సిద్ధమవుతోంది.

*** కౌంటర్ అటాక్ దిశగా రేవంత్ 'మేడిగడ్డ' అస్త్రం**

ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ కూడా గట్టిగానే వ్యూహరచన చేసింది. కేసీఆర్ సభ జరుగుతున్న రోజే.. కౌంటర్‌గా జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహాదేవపూర్ మండలంలోని మేడిగడ్డ బ్యారేజీ పర్యటనను సీఎం ఖరారు చేశారు. బ్యారేజీ మరమ్మతుల పరిశీలనకే పరిమితం కాకుండా, కాటారం - మహాదేవపూర్ మార్గంలోని నస్తూరుపల్లి వద్ద భారీ బహిరంగ సభ ఏర్పాటు చేశారు. ఈ సభ ద్వారా కాళేశ్వరం ప్రాజెక్టు వైఫల్యాలు, బీఆర్ఎస్ హయాంలో జరిగిన లోపాలను ఎత్తిచూపుతూ కేసీఆర్‌పై నేరుగా రాజకీయ దాడి చేయాలని కాంగ్రెస్ భావిస్తోంది. మంత్రి శ్రీధర్‌బాబు ఈ ఏర్పాట్లను స్వయంగా పర్యవేక్షిస్తున్నారు.

*** గతంలో చెల్లని రూపాయి.. ఇప్పుడూ..? : మంత్రి అడ్లూరి**

ఇరు పార్టీల అగ్రనేతల పర్యటనల నేపథ్యంలో, ద్వితీయ శ్రేణి నాయకులు, మంత్రుల మధ్య మాటల తూటాలు పేలుతున్నాయి. జీవన్‌రెడ్డి పార్టీ వీడటంపై మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం జగిత్యాల జిల్లా కేంద్రంలో మీడియా సమావేశం నిర్వహించిన ఆయన "గతంలో జీవన్‌రెడ్డిని చెల్లని రూపాయిగా అభివర్ణించిన కేటీఆర్.. ఇప్పుడు ఆయన్ను ఎలా స్వీకరిస్తున్నారు? గతంలో 40 ఏండ్లు పదవులు అనుభవించిన ఆయన ఇప్పుడు పదవులు దక్కలేదన్న అసంతృప్తితోనే పార్టీ మారుతున్నారు' అని విమర్శించారు.

*** గుంట నక్కలు భయపడుతున్నాయి : కేటీఆర్, హరీశ్‌రావు**

మంత్రి వ్యాఖ్యలు, సీఎం టూర్‌పై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ సైతం గట్టి కౌంటర్ ఇచ్చారు. శనివారం మాజీ మంత్రి హరీశ్‌రావుతో కలిసి జీవన్‌రెడ్డితో సమావేశమైన ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'కేసీఆర్ బయటకు వస్తుంటే గుంట నక్కలు భయపడుతున్నాయి. అందుకే రేవంత్ మేడిగడ్డ సభ పెట్టుకున్నారు. రేవంత్ హైట్ చిన్నది కాదు.. మెదడు చిన్నది' అంటూ ఘాటు వ్యాఖ్యలు చేశారు. అనంతరం హరీశ్‌రావు మాట్లాడుతూ.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా మాట్లాడిన బీజేపీ ఎంపీ తేజస్వి సూర్యపై తీవ్ర స్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. ఆయన క్షమాపణలు చెప్పాలని డిమాండ్ చేస్తూనే.. బీఆర్ఎస్ ఎంపీలు పార్లమెంటులో లేని లోటు కనిపిస్తోందని సెంటిమెంట్ రగిల్చే ప్రయత్నం చేశారు.

**నీ ఇల్లే కుంగింది..: ఎర్రబెల్లి**

మరోవైపు సీఎం రేవంత్ టూర్‌కు కౌంటర్‌గా మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తన జిల్లా నేతలతో కలిసి ముందే మేడిగడ్డను సందర్శించారు. అక్కడ ఆయన మీడియాతో మాట్లాడుతూ.. 'జూబ్లీహిల్స్‌లో నువ్వు కట్టుకున్న ఇల్లే కుంగింది.. అంత పెద్ద ప్రాజెక్టులో చిన్న ఇబ్బంది వస్తే రాద్ధాంతం చేస్తావా?' అంటూ సీఎం రేవంత్‌ను ఉద్దేశించి విమర్శించారు. ఏదేమైనా ఈ నెల 20న జగిత్యాల వివేకానంద స్టేడియం, అటు నస్తూరుపల్లిలో ఇరు పక్షాల నేతలు సంధించే విమర్శనాస్త్రాలు రాబోయే రోజుల్లో రాష్ట్ర రాజకీయ ముఖచిత్రాన్ని మరింత వేడెక్కించడం ఖాయమనే చెప్పొచ్చు.

## హర్మూజ్ మళ్లీ మూసివేత... ఇరాన్ సంచలన నిర్ణయం

టెహ్రాన్, ఏప్రిల్ 18: అమెరికాతో ఉద్రిక్తతల నేపథ్యంలో ఇరాన్ సంచలన నిర్ణయం తీసుకుంది. వ్యూహాత్మకమైన హర్మూజ్ జలసంధిని మళ్లీ మూసివేసింది. హర్మూజ్ పై మళ్లీ కఠిన నియంత్రణ విధిస్తున్నట్లు నేడు ఓ ప్రకటనలో తెలిపింది. తమ ఓడరేవులకు వచ్చే నౌకలపై అమెరికా నేవీ దిగ్బంధనాన్ని కొనసాగించడమే ఈ నిర్ణయానికి కారణమని, ఇచ్చిన మాటను అమెరికా ఉల్లంఘించిందని ఇరాన్ ఆరోపించింది. "ఇరాన్ నౌకలకు స్వేచ్ఛా రవాణాను అమెరికా పునరుద్ధరించే వరకు ఈ పరిస్థితిలో మార్పు ఉండదు. హర్మూజ్ జలసంధి కఠినంగా నియంత్రించబడుతుంది" అని ఇరాన్ సైనిక కమాండ్ తమ అధికారిక టెలివిజన్‌లో స్పష్టం చేసింది. ఇజ్రాయెల్‌లెబనాన్ కాల్పుల విరమణ ఒప్పందం తర్వాత, కేవలం రెండు రోజుల క్రితమే ఇరాన్ ఈ జలసంధిని తెరిచింది. అయితే, ఇరాన్‌తో విస్తృత ఒప్పందం కుదిరే వరకు నేవీ దిగ్బంధనం కొనసాగుతుందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్పష్టం చేయడంతో పరిస్థితి మళ్లీ మొదటికొచ్చింది. పర్షియన్ గల్ఫ్ నుంచి ఆయిల్ ఎగుమతులకు హర్మూజ్ జలసంధి ప్రధాన మార్గం. ప్రపంచ ఆయిల్ రవాణాలో దాదాపు 20 శాతం ఇక్కడి నుంచే జరుగుతుంది. ఇరాన్ తాజా నిర్ణయంతో మధ్యప్రాచ్యంలో ఉద్రిక్తతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని, ఇది ప్రపంచ ఆయిల్ ధరలపై ప్రభావం చూపే ప్రమాదం ఉందని నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

## రాజమండ్రి–విశాఖ మధ్య 3, 4వ రైల్వే లైన్ల నిర్మాణం.. కేంద్రం ఆమోదం

ఆంధ్రప్రదేశ్‌లో కీలకమైన రైల్వే ప్రాజెక్టుకు కేంద్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసింది. రాజమండ్రి (నిడదవోలు) విశాఖపట్నం (దువ్వాడ) మధ్య 198 కిలోమీటర్ల మేర మూడో రైల్వే లైను, నాలుగో రైల్వే లైను నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఈ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.9,889 కోట్లుగా ఉంది. శనివారం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన జరిగిన ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. హౌరాచెన్నై హై డెన్సిటీ నెట్‌వర్క్‌లో భాగంగా ఈ ప్రాజెక్టును చేపట్టనున్నారు. ఈ రైల్వే మార్గం తూర్పు గోదావరి, కోనసీమ, కాకినాడ, అనకాపల్లి, విశాఖపట్నం జిల్లాల గుండా వెళుతుంది. తూర్పు తీర రైల్వే కారిడార్‌లో ఇది అత్యంత రద్దీగా ఉండే మార్గాల్లో ఒకటిగా ఉంది, ముఖ్యంగా సరుకు రవాణాకు కీలకం. ఈ ప్రాజెక్టు పూర్తయితే అన్నవరం, అంతర్వేది, ద్రాక్షారామం వంటి పుణ్యక్షేత్రాలకు వెళ్లే యాత్రికులకు ప్రయాణం మరింత సులభతరం కానుంది. ఆంధ్రప్రదేశ్‌తో పాటు ఉత్తరప్రదేశ్‌లోని ఘజియాబాద్‌సీతాపూర్ మధ్య మరో ప్రాజెక్టుకు కూడా కేంద్రం ఆమోదం తెలిపింది. ఈ రెండు ప్రాజెక్టుల మొత్తం వ్యయం రూ.24,815 కోట్లు. ఈ ప్రాజెక్టుల ద్వారా మొత్తం 601 కిలోమీటర్ల మేర రైల్వే నెట్‌వర్క్ విస్తరించనుంది. ఈ కొత్త లైన్ల నిర్మాణం బొగ్గు, ఆహార ధాన్యాలు, సిమెంట్, ఎరువులు వంటి సరుకుల రవాణాను వేగవంతం చేయడంతో పాటు, పర్యాటక రంగ అభివృద్ధికి కూడా దోహదపడుతుందని కేంద్రం ఒక ప్రకటనలో పేర్కొంది.

*** ఏపీ శనగ రైతులకు కేంద్రం ఊరట.. కొనుగోలు పరిమితి పెంపు**

ఆంధ్రప్రదేశ్‌లోని శనగ రైతులకు కేంద్ర ప్రభుత్వం తీపి కబురు అందించింది. రాష్ట్రంలో మద్దతు ధర పథకం కింద శనగల కొనుగోలు పరిమితిని గణనీయంగా పెంచుతూ శనివారం కీలక నిర్ణయం తీసుకుంది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తి మేరకు, కొనుగోలు గరిష్ఠ పరిమితిని 1,13,250 మెట్రిక్ టన్నులకు పెంచుతూ కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఆమోదం తెలిపారు. వాస్తవానికి తొలుత 94,500 మెట్రిక్ టన్నుల సేకరణకు అనుమతి ఇవ్వగా, ఇప్పుడు ఆ పరిమితిని పెంచారు. ఏపీతో పాటు ఇతర రాష్ట్రాల రైతుల ప్రయోజనాలను కాపాడేందుకు కూడా కేంద్రం పలు చర్యలు ప్రకటించింది. ఉత్తరప్రదేశ్‌లో 20 లక్షల మెట్రిక్ టన్నుల బంగాళాదుంపల కొనుగోలుకు, కర్ణాటకలో కందుల కొనుగోలు గడువును మే 15 వరకు పొడిగించడానికి ఆమోదం తెలిపారు. ఈ సందర్భంగా మంత్రి చౌహాన్ మాట్లాడుతూ, ప్రధానమంత్రి నరేంద్ర మోదీ నాయకత్వంలో రైతుల ప్రయోజనాల పరిరక్షణకు కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. మార్కెట్ ఒడిదొడుకుల కారణంగా ఏ రైతు కూడా తమ పంటను తక్కువ ధరకు అమ్ముకోవాల్సిన పరిస్థితి రాకూడదన్నదే ప్రభుత్వ లక్ష్యమని ఆయన వివరించారు. రాష్ట్ర ప్రభుత్వాలతో సమన్వయం చేసుకుంటూ రైతులకు అవసరమైన సహాయాన్ని తక్షణం అందిస్తామని హామీ ఇచ్చారు.

## మహిళా బిల్లు పతనం.. విపక్షాలకు జీవితాంతం చింతే: మోదీ

న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్ సభలో మహిళా రిజర్వేషన్ బిల్లు వీగిపోవడంపై ప్రధానమంత్రి నరేంద్రమోదీ మరోసారి స్పందించారు. ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసిన విపక్షాలు జీవితాంతం చింతిస్తాయని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు మద్దతివ్వకుండా విపక్షాలు చాలా పెద్ద తప్పు చేశాయని ఆయన అన్నారు. ప్రధాని నరేంద్రమోదీ అధ్యక్షతన ఢిల్లీలోని పార్లమెంట్ హౌస్‌లో శనివారం కేంద్రమంత్రివర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ బిల్లుకు వ్యతిరేకంగా ఓటు వేసినందుకు విపక్షాలు భారీ మూల్యం చెల్లించుకోవడం ఖాయమని అన్నారు. బిల్లుకు వ్యతిరేకంగా ఉన్నదే కాకుండా దానిని కప్పిపుచ్చుకోవడానికి వారు సాకులు వెతుకుతున్నారని విమర్శించారు. ప్రతిపక్షాలు మహిళా రిజర్వేషన్‌కు వ్యతిరేకమనే విషయాన్ని ప్రతి గ్రామానికి చేరవేయాలని పిలుపునిచ్చారు. చట్టసభల్లో మహిళలకు 33 శాతం రిజర్వేషన్లు కల్పిస్తూ 131వ రాజ్యాంగ సవరణ బిల్లును కేంద్ర ప్రభుత్వం శుక్రవారం లోక్ సభలో ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే.

## అడిగినంత ఇస్తేనే అనుమతికి సిఫార్సు!

హైదరాబాద్: రాష్ట్రంలో ఏటా ఇంజినీరింగ్, ఫార్మసీ, మేనేజ్‌మెంట్ కళాశాలల తనిఖీల వ్యవహారం కొందరు జేఎన్‌టీయూహెచ్ ఆచార్యులకు కాసుల వర్షం కురిపిస్తోంది. ముఖ్యంగా వర్సిటీలో కీలక పదవిలో ఉన్న ఓ ఆచార్యుడు వస్తున్నారంటే కళాశాలల యజమానులు వణికిపోతున్నారు. ఆయనకు రూ.4 లక్షలు ముట్టజెప్పాల్సిందేనంటూ తలలు పట్టుకుంటున్నారు. ఇవ్వకుంటే కనీస నిబంధనలు పాటించడంలేదని, వసతులు లేవని జేఎన్‌టీయూహెచ్‌కు సిఫార్సు చేస్తారని.. దీంతో అనుబంధ గుర్తింపు రాకపోవచ్చన్న భయంతో యజమానులు అడిగినంత ఇచ్చేస్తున్నట్లు తెలుస్తోంది. ప్రతి విద్యాసంవత్సరం ప్రారంభానికి ముందు ఆయా కళాశాలల్లో మౌలిక వసతులను పరిశీలించి.. నిబంధనల ప్రకారం ఉంటే జేఎన్‌టీయూహెచ్ అనుబంధ గుర్తింపు ఇస్తుంది. అందుకు ఇద్దరు లేదా ముగ్గురు ఆచార్యులతో నిజ నిర్ధారణ కమిటీ(ఎఫ్ఎఫ్‌సీ)లను ఏర్పాటుచేస్తారు. ఈ నెల 10 నుంచి కళాశాలల తనిఖీలు మొదలవగా... 25వ తేదీ వరకు కొనసాగనున్నాయి. గతఏడాది వరకు కళాశాలను బట్టి కొందరు ఆచార్యులు రూ.1 2 లక్షలు తీసుకునేవారన్న ఆరోపణలున్నాయి. ఈసారి వర్సిటీలో కీలక పదవిలో ఉన్న ఆచార్యుడు ఏకంగా రూ.4 లక్షలు డిమాండ్ చేస్తున్నట్లు సమాచారం. విచిత్రంగా ఆయన బృందానికే కీలకమైన, పెద్ద ఇంజినీరింగ్ కాలేజీలను తనిఖీలకు అప్పగిస్తుండటం గమనార్హం. డీమ్డ్ వర్సిటీగా మారాలని యోచిస్తున్న.. కీసర వైపు ఉన్న ఓ కళాశాల, నాగోలు సమీప ప్రాంతంలోని మరో కళాశాల నుంచి రూ.4 లక్షల చొప్పున ముడుపులు అందుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఆ బృందంలో ఆయనతోపాటు మరొకరు ఉంటారు. ఇతర బృందాల్లోని మరికొందరు ఇచ్చిన మేరకు తీసుకుంటున్నారని, కొందరు మాత్రం డిమాండ్ చేస్తున్నారని ప్రచారం సాగుతోంది. అయితే ముడుపులేమీ తీసుకోనివారు కూడా పలువురు ఉన్నారు. 'గతంలో బృందంలోని ఒక్కో సభ్యుడికి రూ.50 వేల నుంచి రూ.లక్ష ఇచ్చేవాళ్లం. ఈసారి చెరో రూ.లక్ష ఇవ్వాలని డిమాండ్ చేయగా ఇచ్చాం. ఓ ఆచార్యుడు మాత్రం తిరస్కరించారు. ఇలా తిరస్కరించడం ఇదే తొలిసారి' అని గ్రామీణ జిల్లాకు చెందిన ఓ కళాశాల యజమాని తెలిపారు. తనిఖీలు పూర్తయిన కళాశాలలు మరోవైపు అధ్యాపకులను తొలగిస్తున్నాయి. హైదరాబాద్ నగరంలోని ఓ ప్రముఖ గ్రూపు సంస్థ దాదాపు 300 మంది అధ్యాపకులను తొలగించింది. దీనిపై కొందరు రాష్ట్ర ఉన్నత విద్యామండలి ఛైర్మన్ ఆచార్య బాలకిష్టారెడ్డికి ఫిర్యాదు చేశారు. ఆయన సమస్యను జేఎన్‌టీయూహెచ్ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విచారణ జరిపి వాస్తవమైతే తగిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

## రన్‌వే క్లోజ్.. పూణెలో ప్రయాణికుల అవస్థలు!

పూణె, అక్టోబర్ 18 : పూణె అంతర్జాతీయ విమానాశ్రయంలో భారత వాయుసేన (IAF)కు చెందిన ఒక విమానానికి ప్రమాదం జరగడంతో విమాన సర్వీసులకు తీవ్ర అంతరాయం కలిగింది. శుక్రవారం రాత్రి జరిగిన ఈ ఘటన కారణంగా రన్‌వేను తాత్కాలికంగా మూసివేయగా, వందలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. అయితే, మరమ్మతుల అనంతరం రన్‌వేను తిరిగి ప్రారంభించినట్లు అధికారులు తెలిపారు. వివరాల్లోకి వెళితే, శుక్రవారం రాత్రి సుమారు 10:25 గంటలకు రొటీన్ నైట్ ఫ్లయింగ్ సోర్టీలో భాగంగా ఒక ఫైటర్ జెట్ ల్యాండ్ అవుతుండగా ఈ ప్రమాదం జరిగింది. విమానం హార్డ్ ల్యాండింగ్ కావడంతో దాని అండర్‌క్యారేజ్ విఫలమైనట్లు ప్రాథమికంగా భావిస్తున్నారు. ఈ ఘటనతో రన్‌వే బ్లాక్ కావడంతో విమానాల రాకపోకలను తక్షణమే నిలిపివేశారు. ఈ ఘటనలో విమాన సిబ్బంది సురక్షితంగా ఉన్నారని, పౌర ఆస్తులకు ఎలాంటి నష్టం జరగలేదని భారత వాయుసేన ఒక ప్రకటనలో తెలిపింది. రన్‌వేను క్లియర్ చేసి, సాధారణ కార్యకలాపాలను వీలైనంత త్వరగా పునరుద్ధరించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించింది. రాత్రంతా శ్రమించి విమానాన్ని తొలగించి, భద్రతా తనిఖీల అనంతరం రన్‌వేను తిరిగి కార్యాచరణలోకి తెచ్చినట్లు ఐఏఎఫ్ తరువాత ప్రకటించింది. ఈ అంతరాయం కారణంగా 17, 18 తేదీల్లో విమాన కార్యకలాపాలపై తీవ్ర ప్రభావం పడింది.

## జూన్ 2 నుంచి ఎంఎంటీఎస్ రైళ్లలో ఉచిత ప్రయాణం!

హైదరాబాద్: హైదరాబాద్ మహానగరంలో పెరిగిపోతున్న ట్రాఫిక్ రద్దీ, కాలుష్య సమస్యలకు చెక్ పెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం కీలక ప్రణాళికతో ముందుకు వచ్చింది. ప్రజారవాణా వ్యవస్థను ప్రోత్సహించడంలో భాగంగా ఎంఎంటీఎస్ రైళ్లలో మహిళలు, పురుషులు సహా అందరికీ ఉచిత ప్రయాణం అందించేలా చర్యలు తీసుకోవాలని నిర్ణయించింది. దీనివల్ల రవాణా ఖర్చులు తగ్గి ప్రజలకు ఆర్థికంగా ఉపయోగపడుతుంది. తెలంగాణ ఆవిర్భావ దినమైన జూన్ 2 నుంచి ఈ పథకాన్ని అమలుచేసేందుకు సిద్ధం అవుతోంది. ఇదే విషయాన్ని వివరిస్తూ దక్షిణ మధ్య రైల్వేకు లేఖ రాయగా జవాబు కూడా వచ్చింది.



**సీఎం రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్**

ఎంఎంటీఎస్‌లో ఉచిత ప్రయాణ పథకానికి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో సీఎస్ రామకృష్ణారావు తదితరులు ఇటీవల ద.మ.రైల్వే జీఎం సంజయ్‌కుమార్ శ్రీవాస్తవతో సమావేశమై చర్చించారు. జూన్ 2 నుంచి ఏడాది పాటు ఈ పథకాన్ని అమలుచేయాలని రాష్ట్ర ప్రభుత్వం భావిస్తోంది. ఫలితాన్ని బట్టి కొనసాగింపుపై నిర్ణయం తీసుకోవాలని యోచిస్తోంది. ప్రస్తుతం ఎంఎంటీఎస్ రైళ్ల ప్రయాణికుల సంఖ్య ఆధారంగా ఏడాదికి ద.మ.రైల్వేకు రూ.10 కోట్ల ఆదాయం వస్తున్నట్లు అంచనా. ఉచిత ప్రయాణ పథకం అమల్లోకి వచ్చాక పెరిగే ప్రయాణికుల సంఖ్యతో నిమిత్తం లేకుండా ప్రస్తుత ఆదాయాన్ని తాము ఇస్తామని రాష్ట్ర ప్రభుత్వం స్పష్టం చేసింది.

*** నిత్యం 38 వేల నుంచి 42 వేల మంది ప్రయాణం**

కొవిడ్ ముందు వరకు ఎంఎంటీఎస్ రైళ్లకు మంచి స్పందనే వచ్చింది. నిత్యం 121 రైళ్లలో..1.20 లక్షల మంది ప్రయాణించేవారు. ప్రస్తుతం 80 88 రైళ్లు తిరుగుతున్నాయి. ప్రయాణికుల సంఖ్య 38వేల నుంచి 42 వేలుగా ఉన్నట్లు సమాచారం. ఎంఎంటీఎస్ రైళ్ల ఫ్రీక్వెన్సీ సరిగా లేకపోవడం, సమయపాలన లేకపోవడంతో ఆదరణ తగ్గుతోంది.

*** జీఎంకు జయేశ్ రంజన్ లేఖ**

ఎంఎంటీఎస్ రైళ్లలో అందరికి ఉచిత ప్రయాణం అమలుచేయాలని కోరుతూ హైదరాబాద్ మెట్రోపాలిటన్ ఏరియా, పురపాలక అభివృద్ధి శాఖ స్పెషల్ సీఎస్ జయేశ్‌రంజన్.. ద.మ.రైల్వే జీఎంకు లేఖ రాశారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మార్చి 26న ఎంఎంటీఎస్ సర్వీసులపై సమీక్షించారని అందులో పేర్కొన్నారు. సీఎం సూచనల్ని లేఖలో ప్రస్తావించారు.

* రద్దీ వేళల్లో ఎంఎంటీఎస్ ట్రిప్పుల సంఖ్య పెంచాలి.
* సమయపాలనను మెరుగుపరచాలి.
* ఎంఎంటీఎస్ స్టేషన్లలో సౌకర్యాల్ని మెరుగుపరచాలి.
* ప్రయాణికుల కోసం ఇంటి నుంచి స్టేషన్‌కు... స్టేషన్ నుంచి ఇంటికి వెళ్లేందుకు వీలుగా ఆర్టీసీ షటిల్ బస్సులు నడుపుతాం. వాటికి రైల్వేస్టేషన్ల ప్రాంగణాల్లో స్థలాల్ని కేటాయించాలి.

**ద.మ. రైల్వే స్పందన ఇలా...**

ఎంఎంటీఎస్‌ల్లో ఉచిత ప్రయాణ పథకానికి సంబంధించి ముసాయిదా ఎంవోయూను పంపాలని ద.మ.రైల్వే తెలంగాణ ప్రభుత్వాన్ని కోరింది. జయేశ్ లేఖకు ప్రిన్సిపల్ చీఫ్ కమర్షియల్ మేనేజర్ ఇటీవె పాండే ప్రత్యుత్తరం ఇచ్చారు. ముసాయిదా ఎంవోయూను పరిశీలించి రైల్వేబోర్డు అనుమతి తీసుకుంటామని ద.మ.రైల్వే తెలిపింది. ఎన్ని రైళ్లు నడపాలి, ఏయే సమయాల్లో నడపాలన్నది ద.మ.రైల్వే నిర్ణయిస్తుందని పేర్కొంది. రైల్వేబోర్డు నిబంధనల ప్రకారం స్టేషన్లలో సౌకర్యాలు కల్పిస్తామని వివరించింది.

ఎంఎంటీఎస్2వ దశకు సంబంధించి తెలంగాణ ప్రభుత్వం రైల్వేశాఖకు రూ.491.45 కోట్లు ఇవ్వాల్సి ఉందని, ఆ మొత్తాన్ని చెల్లించాలని కోరింది.

## బుధవారమే డెడ్‌లైన్.. ఒప్పందం కుదరకుంటే మళ్లీ బాంబులే: ట్రంప్

వాషింగ్టన్/టెహ్రాన్, ఏప్రిల్ 18 : అణు ఒప్పందం విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య మాటల యుద్ధం తీవ్రస్థాయికి చేరింది. వచ్చే బుధవారం లోపు ఒప్పందం ఖరారు కాకపోతే ఇరాన్‌పై మళ్లీ బాంబు దాడులు ప్రారంభిస్తామని ట్రంప్ హెచ్చరికలు జారీ చేశారు. అయితే, ట్రంప్ వాదనలను ఇరాన్ ప్రభుత్వం తీవ్రంగా ఖండించింది. అవన్నీ అబద్ధాలని కొట్టిపారేసింది. హమాస్, హిజ్బుల్లా వంటి సంస్థలకు నిధులు ఆపడానికి, అణు కార్యక్రమాన్ని నిరవధికంగా నిలిపివేయడానికి ఇరాన్ అంగీకరించిందని ట్రంప్ తెలిపారు. ఇరాన్‌లోని శుద్ధిచేసిన యురేనియం నిల్వలను కూడా అమెరికాకు తరలించడానికి ఒప్పుకుందని ఆయన ప్రకటించారు. ఒప్పందం పూర్తయ్యే వరకు ఇరాన్‌పై నావికాదళ దిగ్బంధనం కొనసాగుతుందని ట్రంప్ తన ట్రూత్ సోషల్ ఖాతాలో పోస్ట్ చేశారు. ట్రంప్ వ్యాఖ్యలపై ఇరాన్ ఘాటుగా స్పందించింది. అమెరికా అధ్యక్షుడు చెప్పిన ఏడు విషయాలూ అబద్ధాలేనని ఇరాన్ ప్రధాన రాయబారి మొహమ్మద్ ఘాలిబాఫ్ పేర్కొన్నారు. "శుద్ధిచేసిన యురేనియం మాకు ఇరాన్ గడ్డతో సమానం. దాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ అమెరికాకు తరలించే ప్రసక్తే లేదు" అని ఇరాన్ విదేశాంగ శాఖ ప్రతినిధి స్పష్టం చేశారు. ప్రస్తుతం అమల్లో ఉన్న తాత్కాలిక కాల్పుల విరమణ మంగళవారంతో ముగియనుండగా, ట్రంప్ విధించిన బుధవారం గడువుతో ఇరు దేశాల మధ్య తీవ్ర ఉద్రిక్తత నెలకొంది.

# మల్కాజిగిరి ఫ్యామిలీ కోర్టులో కొత్త జడ్జీల బాధ్యతల స్వీకారం



ప్రజాస్ఫూర్తి, కాప్ర : మేడ్చల్-మల్కాజిగిరి ఫ్యామిలీ కోర్టులో కొత్తగా నియమితులైన న్యాయమూర్తులు శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. హానరబుల్ ప్రిన్సిపల్ ఫ్యామిలీ కోర్ట్ జడ్జిగా రాచపూడి శ్రీదేవి, అదనపు ఫ్యామిలీ కోర్ట్ జడ్జిగా కె. ఉమాదేవి బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా మల్కాజిగిరి బార్ అసోసియేషన్ ఎగ్జిక్యూటివ్ కమిటీ సభ్యులు కొత్తగా బాధ్యతలు స్వీకరించిన ఇద్దరు న్యాయమూర్తులను మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కోర్టు వ్యవహారాలు సమర్థవంతంగా సాగేందుకు తమవంతు సహకారం అందిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు రత్తయ్య, ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్, ఉపాధ్యక్షుడు హరికృష్ణ, మహిళా ఉపాధ్యక్షురాలు ప్రసన్న, సంయుక్త కార్యదర్శి రవి శంకర్, మహిళా సంయుక్త కార్యదర్శి జలజ, కోశాధికారి పుణ్యరాజు, లైబ్రరీ సెక్రటరీ సాయినాథ్ గౌడ్, స్పోర్ట్స్ & కల్చరల్ సెక్రటరీ పవన్ కుమార్ బిఎన్, లేడీ రిప్రెజెంటేటివ్ సుజాత, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్ నవనీత, ఎగ్జిక్యూటివ్ మెంబర్లు బద్రీనాథ్, రాకేష్ ఎన్, నరేందర్, నరేష్, శోభా రాణి, విమల తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ అజ్ఞానంతో వ్యవహరిస్తోంది

- **షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్"**
- **బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు క్షమార్హం కాదు**



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : తెలంగాణ తల్లి క్షోభించేలా, అమరులను అవమానించేలా బీజేపీ ఎంపీ తేజస్వీ సూర్య వ్యాఖ్యలు చేశారని, కేంద్ర ప్రభుత్వం పార్లమెంటులో అజ్ఞానంతో వ్యవహరిస్తుందని షాద్ నగర్ ఎమ్మెల్యే, రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థల చైర్మన్ "వీర్లపల్లి శంకర్" మండిపడ్డారు. శనివారం రంగారెడ్డి జిల్లా షాద్ నగర్ లో జరిగిన మీడియా సమావేశంలో ఎమ్మెల్యే శంకర్ మాట్లాడారు. 'తెలంగాణ ఏర్పాటును అవహేళన చేస్తూ మాట్లాడితే తేజస్వి'ని బిజెపి తోటి ఎంపీలు మౌనంగా ఉంటూ ఏమనకపోవడం అనుమానాలకు తావిస్తుందని అన్నారు. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కించపరిచేలా తేజస్వి మాట్లాడుతుంటే.. బీజేపీ రాష్ట్ర ఎంపీలు, కేంద్ర మంత్రులు చూస్తూ కూర్చోవడం దౌర్భాగ్యమని మండిపడ్డారు. అజ్ఞానులు, ధనబలం, మందబలంతో లోక్‌సభకు వచ్చిన బీజేపీ ఎంపీలకు వారి పార్టీ అయినా బుద్ధి నేర్పించాలని వ్యాఖ్యానించారు. తేజస్వి వ్యాఖ్యలను రికార్డుల నుంచి తొలగించాలంటూ ఎమ్మెల్యే శంకర్ డిమాండ్ చేశారు. గతంలో ప్రధాని మోదీ తల్లిని చంపి బిడ్డను వేరు చేశారంటూ మాట్లాడారని.. ఆ విద్వేష భావజాలమే ఇప్పుడు తేజస్వి మాటల్లో ప్రతిబింబిస్తోందని విమర్శించారు. తేజస్వి వ్యాఖ్యలు హేయమని, తెలంగాణ ప్రజల ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమేనని పేర్కొన్నారు. వెంటనే తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# తెలంగాణ ఉద్యమ కారులను అన్యాయంగా అరెస్టు చేసారు

- **సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి గడిపె మల్లేశ్**



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ప్రత్యేక రాష్ట్ర సాధన కోసం ప్రజా పోరాటాలు నిర్వహించి పోలీస్ కేసుల పాలై జైలుకెళ్లి కోర్టుల చుట్టు తిరిగిన ఉద్యమ కారులకు గత బిఆర్ఎస్ ప్రభుత్వంలో అన్యాయం చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే తెలంగాణ ఉద్యమ కారులకు 250 గజాల ఇంటి స్థలం 25 వేల ఫించన్ మంజూరి చేసి మిగతా సంక్షేమ పథకాలు ఇచ్చి న్యాయం చేస్తామని హామీ ఇచ్చిన ముఖ్యమంత్రి రెవంత్ రెడ్డి నేటి మూడు సంవత్సరాలు గడుస్తున్నా ఎన్నికల హామీలను అమలు చేయడంలో జాప్యం చేస్తోందని సిఎం రెవంత్ రెడ్డి వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం సచివాలయం ముట్టడించిన ఉద్యమ కారులను అన్యాయంగా పోలీసులు అరెస్టు చేశారని కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీని అమలు చేస్తే ఉద్యమాలు ఎందుకు చేస్తారని సిపిఐ జిల్లా సహాయ కార్యదర్శి తెలంగాణ ఉద్యమ కారుడు గడిపె మల్లేశ్ కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరిని తప్పుబట్టారు శనివారం ఆయన విలేఖరులతో మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా 6గ్యారంటీలలో భాగంగా తెలంగాణ ఉద్యమ కారులకు ఇచ్చిన హామీలను రెవంత్ రెడ్డి అమలు చేయాలని లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమం మరింత ఉధృతం చేస్తామని గడిపె మల్లేశ్ డిమాండ్ చేశారు.

# పాలిసెట్ అభ్యర్థులకు ఉచిత శిక్షణ

ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: పాలిసెట్ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకున్న పదవ తరగతి ఉత్తీర్ణులైన బాలబాలికలకు రుద్రంపూర్ ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో ఉచిత శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రధానాచార్యులు బండి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర వ్యాప్తంగా మే 13వ తేదీన పాలిసెట్ ప్రవేశ పరీక్ష జరగనున్న నేపథ్యంలో విద్యార్థులు పరీక్షకు సమగ్రంగా సిద్ధం కావడానికి ఈ శిక్షణా తరగతులు ఉపయుక్తంగా ఉంటాయని పేర్కొన్నారు. ఆసక్తి గల విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. శిక్షణా తరగతులు ప్రతి రోజు ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 12 గంటల వరకు నిర్వహించబడతాయని, పూర్తి వివరాలకు 7989103699 నంబర్‌ను సంప్రదించాలని సూచించారు.

# పేరుకుపోయిన వడ్ల రాశులు ఇబ్బందుల్లో రైతులు

- **మిల్లర్లకు, అధికారులకు మధ్య కొలిక్కిరాని కొనుగోలు ప్రక్రియ**

హుస్నాబాద్, ప్రజా స్ఫూర్తి : ఇప్పటివరకు మిల్లర్లకు కొనేందుకు అలాట్మెంట్ పర్మిషన్ రాలేదు అయిన వడ్ల కొనుగోలు ప్రక్రియ ఎందుకు ప్రారంభించారో అధికారులు చెప్పవలసిన అవసరం ఉందని, కొనుగోలు ప్రక్రియ మొదలు కాకపోవడంతో మార్కెట్ యార్డులో ధాన్యం రాశులు పేరుకుపోయి రైతులు ఇబ్బందులు పడుతున్నారని భారతీయ కిసాన్ సంఘ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి ఆరోపించారు. గత వానాకాలం సంబంధించిన వడ్లు ఇప్పటివరకు మిల్లింగ్ చేయలేదు దానికి సంబంధించిన కిరాయి గాని ప్రభుత్వ సంబంధించిన డబ్బులు వచ్చిన తర్వాతనే కొంటాము అంటున్న మిల్లర్లు వడ్ల రాశులతో మార్కెట్ కానీ ఐకెపి సెంటర్లు ధాన్యం రాశులు, ప్రభుత్వ అనుమతులు రాకున్నా వడ్ల కొనుగోలు సెంటర్లను ప్రారంభించిన వారిపై చర్యలు తీసుకోవాలని మరియు రైతాంగానికి భేషరతుగా క్షమాపణలు చెప్పాలని భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఇంచార్జ్ కవ్వ వేణుగోపాల్ రెడ్డి డిమాండ్ చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వ యంత్రాంగం స్పందించి మిల్లర్లతో కొనుగోలు చేసే విధంగా రైతుల యొక్క ధాన్యాన్ని వెంటనే కొనుగోలు చేయాలని, లేకుంటే సోమవారం రోజున రైతులందరికీ పెద్ద ఎత్తున భారతీయ కిసాన్ సాంగ్ డివిజన్ ఆధ్వర్యంలో మార్కెట్ యాడ్ ముందు మంత్రి క్యాంప్ కార్యాలయం ముందు ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వం రూపొందించిన విధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలి

- **వివిధ ధాన్యం సేకరణ కేంద్రాలని తనిఖీ చేసిన రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : ప్రభుత్వం రూపొందించిన విధివిధానాల ప్రకారమే ధాన్యం సేకరణ చేయాలని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎన్. కోదండ రెడ్డి అన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతులు ధాన్యం అమ్మిన తర్వాత మిల్లులకు వెళ్లాల్సిన అవసరం లేదని ,ఒకవేళ ఎవరైనా రైతులను రైస్ మిల్లులకు పంపిస్తే సంబంధిత అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఆయన హెచ్చరించారు. శనివారం రైతు కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి నల్గొండ జిల్లా కేంద్రం సమీపంలో ఉన్న ఆర్జాల బావి ,ఎస్ఎల్ బి సీ మార్కెట్ యార్డ్ లో ఉన్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను సంబంధిత అధికారులతో కలిసి తనిఖీ చేశారు. కొనుగోలు కేంద్రాలలోని ధాన్యపు రాశులు, తేమ, తాలు, తరుగు తదితర వివరాలను తెలుసుకోవడమే కాకుండా ధాన్యాన్ని ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం రెండుచోట్ల రైతులు, హమాలీలు, ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహకులు, అధికారులతో సమావేశాలు నిర్వహించారు ధాన్యం సేకరణ పాలసీకి విరుద్ధంగా ఎవరు సేకరణ చేయకూడదని, ధాన్యం కొనుగోలు విషయంలో రైతులను ఇబ్బంది పెడితే సహించేది లేదని, ఇందుకు సంబంధిత శాఖల అధికారులే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. కొనుగోలు కేంద్రం నుండి మిల్లులకు ధాన్యాన్ని పంపించిన తర్వాత మీల్లులకు వెళ్లాల్సిన బాధ్యత అధికారులదేనని, ధాన్యం విషయంలో రైస్ మిల్లర్ల పెత్తనం కుదరదని, గతంలో పద్ధతి చెల్లదని ఆయన స్పష్టం చేశారు. తాలు ,తరుగు ,తేమకు సంబంధించి ఏవైనా సమస్యలు ఉంటే రైతులు కొనుగోలు కేంద్రంలోనే పరిష్కారం చేసుకోవాలని, మిల్లర్లకు ఏదైనా సమస్య ఉంటే ప్రభుత్వంతో మాట్లాడి పరిష్కరించుకోవాలని ఆయన తెలిపారు. ఎఫ్ సి ఐ గైడ్ లైన్స్ ప్రకారం రబీ ధాన్యం కొనుగోలు కు సంబంధించి తేమ, తరుగు వంటివి కొనుగోలు కేంద్రం లోనే ముందే చూసుకోవాలని, రైతుల సొంత ఖర్చులతో కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకువస్తారని, తాలు, తరుగు పేరుతో వారిని ఇబ్బంది పెట్టడం భావ్యం కాదని, శాస్త్రీయంగా మద్దతు ధర వచ్చేలా చూడాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. కాంటా వేయకముందు తాలూ, తరుగు, తేమ హమాలీ పేరుతో కొనుగోలు కేంద్రాలలో అనేక ఇబ్బందులు పడుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇకపై ఇలాంటివన్నీ ఉండడానికి వీలులేదని, ధాన్యం సేకరణ విధానాల ప్రకారమే ధాన్యాన్ని కొనుగోలు చేయాలని, ఎవరైనా తేమ,తరుగు, తాలు పేరుతో రైతులను ఇబ్బందులు పెడితే సహించేది లేదని అన్నారు. ఇకపై ఇలాంటి అన్ని ఆపివేయాలని ఆయన తెలిపారు. రైతు సంక్షేమ కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, రైతు సంక్షేమ కమిషన్ మెంబెర్ సెక్రెటరీ గోపాల్, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్ ,రెవెన్యూ అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్, స్థానిక సంస్థల ఇంచార్జ్ అదనపు కలెక్టర్ వై. అశోక్ రెడ్డి ,మార్కెటింగ్ ఎడి ఛాయాదేవి, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ రాంపతి నాయక్, డిఎస్ఓ, తహసిల్దార్ పరశురాం, మాజీ జెడ్పిటిసి గుమ్మలమోహన్ రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ బుర్రి శ్రీనివాసరెడ్డి, ఆదర్శ రైతు రామిరెడ్డి, తదితరులు ఉన్నారు.

# వేసవి ఏర్పాట్లు, మౌలిక సదుపాయాలు, ఆదాయ వృద్ధి, పై కమిషనర్ కీలక ఆదేశాలు

- **అధికారులతో కమిషనర్ సమీక్ష.**



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆధ్వర్యంలో అన్ని శాఖల అధికారులు, ఇంజినీరింగ్, రెవెన్యూ, శానిటేషన్ సిబ్బంది, వార్డు అధికారులతో కమిషనర్ శరత్చంద్ర సమీక్ష సమావేశం నిర్వహించారు. పట్టణంలో ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పన, వేసవి నేపథ్యంలో తీసుకోవాల్సిన చర్యలు, ఆదాయ వృద్ధి, ప్రజా సమస్యల పరిష్కారంపై కమిషనర్ పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ ట్రాఫిక్ సిగ్నల్స్ వద్ద ప్రజలకు ఉపశమనం కల్పించేందుకు షేడ్ నెట్ ఏర్పాటు చేయుటకు అనువైన ప్రదేశాలను గుర్తించి వెంటనే పనులు ప్రారంభించి సోమవారంలోగా పూర్తి చేయాలని ఆదేశించారు. పట్టణంలోని ప్రధాన ప్రదేశాల్లో సమ్మర్ వాటర్ పాయింట్లు (చలివేంద్రాలు) వెంటనే ఏర్పాటు చేసి ఈరోజు నుంచే ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని సూచించారు. ట్రేడ్ లైసెన్సులు, నీటి పన్ను వసూళ్లు, పెన్షన్ దరఖాస్తులు సహా సంబంధిత వార్డుకు సంబంధించిన అన్ని పనులు సమర్థవంతంగా నిర్వహించాలని, ప్రజా ఫిర్యాదులను సకాలంలో పరిష్కరించి ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని కమిషనర్ స్పష్టం చేశారు. నల్గొండ మునిసిపల్ కార్పొరేషన్ ఆదాయ వృద్ధికి అన్ని శాఖలు సమన్వయంతో పనిచేసి రెవెన్యూ పెంపు దిశగా కృషి చేయాలని, అదే సమయంలో ప్రజా సమస్యల పరిష్కారంలో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు. అవసరమైన చోట శాఖల మధ్య సమన్వయం పెంచి పనులు వేగవంతం చేయాలని తెలిపారు. ఈ సమావేశంలో ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ బి. రాములు, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు పి. అశోక్, కార్తీక్, అసిస్టెంట్ ఇంజనీర్లు దిలీప్, అసీం బాబా, ప్రవీణ్, శానిటరీ సూపర్వైజర్ జి. శ్రీనివాస్, శానిటరీ ఇన్స్పెక్టర్ ప్రదీప్ రెడ్డి, రెవెన్యూ అధికారి శివరాం రెడ్డి, టీఎంసీ శ్రీనివాస్, వార్డు అధికారులు పాల్గొన్నారు.

# బూర్గుల ఆరోగ్య కేంద్రంలో ప్రపంచ కాలేయ దినోత్సవం



ప్రజాస్ఫూర్తి, షాద్నగర్ : ప్రపంచ కాలేయ దినోత్సవం సందర్భంగా జిల్లా వైద్య , ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ కే లలితా దేవి మన శరీరంలో అత్యంత కీలకమైన అవయవాలలో ఒకటి కాలేయం (లివర్ )అని ఇది శరీరంలో అనేక ముఖ్యమైన జీవక్రియలకు కేంద్ర బిందువుగా పనిచేస్తుంది మనం తీసుకునే ఆహారము నీరు ఔషధాలు వంటి అన్ని పదార్థాలను శుద్ధి చేయడంలో కాలేయం ప్రధాన పాత్ర పోషిస్తుంది ఇది 500 పైగా ముఖ్యమైన విధులను నిర్వహిస్తుందని, తెలిపారు కాలేయానికి ప్రత్యేకంగా పునరుత్పత్తి సామర్థ్యం ఉన్నప్పటికీ నిర్లక్ష్యం వలన తీవ్రమైన నష్టం కలగవచ్చు, ముఖ్యంగా కాలేయం దెబ్బతిన్న ప్రారంభ దశలో లక్షణాలు కనిపించకపోవడం వల్ల దీనిని నిశ్శబ్ద హంతకుడు అని పిలుస్తారు. ప్రస్తుతం కాలేయ వ్యాధులు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్నాయిమద్య సేవనం మాత్రమే కాకుండా అధిక కొవ్వు వున్న ఆహారము ,జంక్ ఫుడ్ ,వ్యాయామం లేకపోవడం వంటి ఆధునిక జీవనశైలి కారణంగా "నాన్ ఆల్కహాలిక్ ఫ్యాటీ లివర్ "కేసులు కూడా ఘనీయంగా పెరుగుతున్నాయి అని ఈ నేపథ్యంలో ప్రజలు జాగ్రత్తలు పాటించాలని డాక్టర్ కే లలిత దేవి తెలిపారు. ప్రతిరోజు కనీసం 30 నుండి 45 నిమిషాలు వ్యాయామం చేయాలి ,సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి ,జంక్ ఫుడ్ అధిక కొవ్వు పదార్థాలు ,చక్కెర పానీయాలు, తగ్గించాలి .మద్యపానం పూర్తిగా నివారించాలి ,తగినంత నీరు తాగాలి ,ఏడాదికి ఒకసారి కాలేయ పనితీరు పరీక్షలు చేయించుకోవాలి . హెపటైటిస్ బి వంటి వ్యాధులపై అవగాహన పెంచుకోవాలి. "మంచి అలవాట్లు పటిష్టమైన కాలేయం"అని నినాదంతో ప్రతి ఒక్కరు ఆరోగ్యకరమైన జీవనశైలిని అనుసరించాలని డాక్టర్ కే లలితా దేవి పిలుపునిచ్చారు. ఆరోగ్యవంతమైన దేశ నిర్మాణంలో పౌరుల ఆరోగ్యమే కీలకమని, కాలేము మన శరీరంలోని నిశ్శబ్ద ఇంజన్ వంటిదని, అది ఎంత స్మూత్ గా రన్ అయితే, మన జీవితం అంతా కాలం సాఫీగా సాగుతుందని, ప్రపంచ కాలేయ దినోత్సవ సందర్భంగా చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని, క్రమం తప్పకుండా శారీరక తమ చేస్తూ మన కాలేయాన్ని కాపాడుకుందాం అని ప్రతిజ్ఞ చేద్దాం. కాలేయ రక్షణ జీవన రక్ష అని గుర్తిద్దామని రంగారెడ్డి జిల్లా డాక్టర్ కే లలితా దేవి పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాస్ మీడియా ఆఫీసర్ కె శ్రీనివాసులు, బూర్గుల వైద్యాధికారి డాక్టర్ రఘురాం, డాక్టర్ జయప్రకాష్, ల్యాబ్ టెక్నీషియన్ వెంకటరమణి స్టాఫ్ నర్స్ సునీత ఫార్మసిస్ట్, రాజశ్రీ, హెల్త్ అసిస్టెంట్ రెడ్డి నాయక్ ఏసి సిబ్బంది పాల్గొన్నారు.

# సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా అమలు చేయాలి

- **వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు**



ప్రజాస్ఫూర్తి, భద్రాద్రి కొత్తగూడెం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు నిర్వహించనున్న 7 రోజుల సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు సూచించారు. శనివారం హైదరాబాద్ నుండి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 99 రోజుల ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలలో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థులకు సంబంధించి పారిశుధ్య పనులు చేపట్టాలని తెలిపారు. విద్యార్థులకు క్విజ్, విద్యా విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని ఆదేశించారు. వసతి గృహాలలో అవసరమైన మరమ్మత్తు పనులు చేపట్టడంతోపాటు విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు నిర్వహించి వసతులపై చర్చించాలని తెలిపారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు, వేసవి శిబిరాలు, బడిబాట కార్యక్రమాలను నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ అంకిత్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు జిల్లాలో సంక్షేమ వారాన్ని పకడ్బందీగా నిర్వహించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. జనగణన కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించేందుకు జిల్లాలో తగిన ఏర్పాట్లు చేయవలసిందిగా సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఏప్రిల్ 26 నుండి మే 10 వరకు స్వయంగా ఆన్‌లైన్ నమోదు (సెల్ఫ్ ఎన్యూమరేషన్) చేసుకునే అవకాశాన్ని ప్రజలు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం మే 11 నుండి జూన్ 9 వరకు ఎన్యూమరేటర్లు ఇంటింటికి వెళ్లి వివరాలు సేకరిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమం పూర్తిగా డిజిటల్ విధానంలో నిర్వహించబడనున్నందున అవసరమైన సాంకేతిక సదుపాయాలు కల్పించి, ప్రజల్లో విస్తృతంగా అవగాహన కల్పించాల్సిందిగా అధికారులను ఆదేశించారు. ఈ సమావేశంలో భద్రాచలం సబ్ కలెక్టర్ మృణాల్ శ్రేష్ఠ, అదనపు కలెక్టర్ వేణుగోపాల్, స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ విద్యా చందన, జడ్పీ సీఈఓ నాగలక్ష్మి, సిపిఓ సంజీవరావు, గృహ నిర్మాణ శాఖ పిడి రవీంద్రనాథ్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# బీబీనగర్ లో జనగణన మొదటి దశ శిక్షణ తరగతులు




భువనగిరి, ప్రజాస్ఫూర్తి : యాదాద్రి భువనగిరి జిల్లా పరిధిలోని బీబీనగర్ మండల కేంద్రంలో శనివారం నిర్వహించిన జనగణన మొదటి దశ శిక్షణ తరగతిలో జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ భాస్కరరావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ శిక్షణ ప్రక్రియను పరిశీలించి, సంబంధిత అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు అందించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో సుమారు 50 మంది ఎనుమరేటర్లు మరియు సూపర్వైజర్లు పాల్గొన్నారని ఆయన తెలిపారు. జనగణన కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహించేందుకు ఈ శిక్షణ ఎంతో ఉపయోగకరమని అధికారులు పేర్కొన్నారు. ఈ శిక్షణ తరగతులు శనివారం, సోమవారం మరియు మంగళవారం రోజుల్లో కూడా కొనసాగనున్నాయి. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్యాంసుందర్ రెడ్డి, ఎంపీడీఓ గ, యం ఈ ఓ, సంబధిత అధికారులు పాల్గొన్నారు.

# సామాజిక ఆర్థిక సర్వే రెమ్యునరేషన్ వెంటనే చెల్లించాలి



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: తెలంగాణలో సామాజిక, ఆర్థిక సర్వేలో విధులు నిర్వహించిన ఉపాధ్యాయులకు రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని జనగణన శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న మహబూబాబాద్ మండల ఉపాధ్యాయులు మధ్యాహ్న భోజన విరామ సమయంలో మున్సిపల్ కార్యాలయం ముందు నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా టి పి టి ఎఫ్ మహబూబాబాద్ మండల ప్రధాన కార్యదర్శి సారెడ్డి రామలింగారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్రంలో 2024 నవంబర్ నెలలో నిర్వహించిన సామాజిక, ఆర్థిక సర్వే కి సంబంధించిన రెమ్యూనరేషన్ ఇంతవరకు చెల్లించకపోవడం బాధాకరమని అన్నారు. ఎన్నోసార్లు అధికారులకు విన్నవించుకున్నా ఇంతవరకు ఆ రెమ్యూనరేషన్ చెల్లింపు విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదని విమర్శించారు. ఇప్పటికైనా ఉపాధ్యాయులకు రావాల్సిన రెమ్యూనరేషన్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు పి ప్రవీణ్, నాగరాజు, చాంప్ల, దబ్బా నరేష్, తల్లాడ శ్రీనివాసరావు, సత్యనారాయణరెడ్డి, వీరబ్రహ్మం, రాజేశ్వర్, కొండ్లె రాము, రామకృష్ణ, సత్యవతి అన్నపూర్ణ, ప్రతిభ, గీతా వాణి, శివరంజని, సంధ్య, వాణి, రాజకుమారి, రాధిక తదితరులు పాల్గొన్నారు.

# శాంతి భద్రతల పరిరక్షణే న్యాయపాలిక ధ్యేయం కావాలి

- **జిల్లా జడ్జి మహమ్మద్ అబ్దుల్ రఫీ**




మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: సమాజంలో శాంతి భద్రతల పరిరక్షణే ధ్యేయంగా పోలీసులు, ప్రాసిక్యూటర్లు , న్యాయమూర్తులు పనిచేయాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి మహమ్మద్ అబ్దుల్ రఫీ పిలుపునిచ్చారు. శనివారం జిల్లా కోర్ట్ ప్రాంగణంలో పోలీస్, ప్రాసిక్యూటర్లు, న్యాయమూర్తుల తో సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేరారోపణ రేటు తో పోలిస్తే నేర నిర్ధారణ రేటు తక్కువతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తప్పు చేసిన వారు ఎట్టి పరిస్థితుల్లోనూ తప్పించుకోకుండా కట్టుదిట్టమైన నేరారోపణ పత్రాలను కోర్టులలో దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించారు. ప్రస్తుత ఏడాది తదుపరి జాతీయ లోక్ అదాలత్ చాలా దూరంలో జూన్ 20 న ఉన్నందున్న ఎక్కువగా కేసులు పరిష్కారమయ్యేలా పోలీస్ యంత్రాంగం కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో జూనియర్ సివిల్ న్యాయ మూర్తులు స్వాతి మురారి, ధీరజ్ కుమార్, ఏ. కృష్ణ తేజ్, జాయింట్ కలెక్టర్ ( రెవిన్యూ ) అనిల్ కుమార్ మహబూబాబాద్ డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ తిరుపతి రావు, తొర్రురు డిప్యూటీ సూపరింటెండెంట్ ఆఫ్ పోలీస్ కృష్ణ కిషోర్, కోర్ట్ ముఖ్య పరిపాలన అధికారి ఎం. క్రాంతి కుమార్, పోక్సో పబ్లిక్ ప్రాసెక్యూటర్ కొంపెల్లి వెంకటయ్య, జిల్లా పరిధిలో ని సీఐ లు, ఎస్సై లు పాల్గొన్నారు.

# రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రజలు భాగస్వామ్యం కావాలి

* హుస్నాబాద్ ఎస్సై పి. లక్ష్మారెడ్డి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ లో వినూత్నంగా 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' హెల్మెట్ ధరించని, త్రిబుల్ రైడింగ్ వాహనదారులకు జరిమానా బదులు గులాబీ దండలు వేసి హుస్నాబాద్ ఎస్ఐ పి. లక్ష్మారెడ్డి అవగాహన కల్పించారు. రోడ్డు ప్రమాదాల నివారణే లక్ష్యంగా అరైవ్ అలైవ్ కార్యక్రమంలో భాగంగా హుస్నాబాద్ ట్రాఫిక్ పోలీసులు, హుస్నాబాద్ పోలీసులు శనివారం ఒక వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. సాధారణంగా ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘిస్తే జరిమానాలు విధించడం పరిపాటి, కానీ ఈరోజు "జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే" పేరుతో ఎటువంటి ఫైన్లు వేయకుండా, కేవలం ప్రేమతో కౌన్సెలింగ్ నిర్వహించి వాహనదారుల్లో మార్పు తెచ్చే ప్రయత్నం చేశారు.హుస్నాబాద్ పట్టణంతో పాటు రహదారిపై ప్రయాణిస్తున్న వాహనదారులను తనిఖీ చేసిన పోలీసులు నిబంధనలు పాటించని వారికి ఎటువంటి చలాన్లు విధించలేదు. బదులుగా వారు చేసిన తప్పుకు ఎంత జరిమానా పడుతుందో వివరించి, ఆ నిబంధన ఉల్లంఘన వల్ల ప్రాణాలకు ఎంత ప్రమాదమో తెలియజేశారు. అనంతరం వారికి ఒక గులాబీ దండ వేసి, మళ్ళీ తప్పు చేయవద్దని సున్నితంగా హెచ్చరించారు.కేవలం జరిమానాలు విధించడం మా ఉద్దేశం కాదు ప్రతి వాహనదారుడు క్షేమంగా ఇంటికి చేరాలనేదే మా ఆకాంక్ష ప్రజల ఆలోచనా విధానంలో మార్పు కోసమే ఈ 'జీరో ఎన్‌ఫోర్స్‌మెంట్ డే' నిర్వహించాం అని హుస్నాబాద్ ఎస్ ఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ట్రాఫిక్ ఎస్ ఐ వెంకటేశ్వర్ రెడ్డి,ట్రాఫిక్ సిబ్బంది పాల్గొన్నారు.

# ఆర్టీసిని ప్రభుత్వం లో విలీనం చేయాలి

, ఆర్టీసి జెఎసి హుస్నాబాద్ డిపో చైర్మన్ రాగిరెడ్డి సుధాకర్ రెడ్డి



హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : తెలంగాణ ఆర్టీసీ కార్మికులు ఈనెల 22 నుండి తలపెట్టిన సమ్మెలో అధికారులు కార్మికులు భాగస్వామ్యం కావాలని న్యాయపరమైన డిమాండ్ల సాధనకు అందరూ కలిసి రావాలని ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని యాజమాన్య బెదిరింపులకు ఆర్టీసీ కార్మికులు భయపడేది లేదని హుస్నాబాద్ డిపో జేఏసీ చైర్మన్ రాగిరెడ్డి సుధాకర్ రెడ్డి అన్నారు..కాంగ్రెస్ పార్టీ ఎన్నికలలో ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ఆర్టీసీని ప్రభుత్వంలో వెంటనే విలీనం చేయాలని ఆయన ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ హుస్నాబార్ ఆర్టీసి డిపోఎదుట కార్మికులతో కలిసి గేట్ ధర్నా నిర్వహించారు. కార్మికుల న్యాయపరమైన డిమాండ్ల కోసం సమ్మెకు సిద్ధం అని భారీ నినాదులు చేస్తూ ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనం చేయాలని ఆయన కోరారు. అనంతరం కో కన్వీనర్ కె.ఎస్ చారి మాట్లాడుతూ అధికారులు కార్మికులను భయభ్రాంతులకు గురిచేస్తూ ఇబ్బందులకు గురి చేయొద్దని న్యాయపరమైన డిమాండ్ల సాధనకే సమ్మె చేస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ప్రభుత్వంలో విలీనం అయితే ఎంతోమంది తెలంగాణ నిరుద్యోగులకు ఉద్యోగ అవకాశాలు వస్తాయని ఆయన అన్నారు.అధికారులు కార్మికులు అనే భేదం లేకుండా అందరూ కలిసికట్టుగా ఈనెల 22 నుండి జరిగే సమ్మెను విజయవంతం చేయాలన్నారు. ఈ కార్యక్రమంలో డిపో కార్మికులు పి.రవీందర్ మహిళ నాకురాలు శైలజ రవళి ధనలక్ష్మి గ్యారేజి కార్మికులు ఉమాశంకర్ రాజ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# వరి కొనుగోళ్లను సమర్థవంతంగా నిర్వహించాలి

– అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: 2025-26 యాసంగిలో జిల్లాలో సుమారు 83,000 మెట్రిక్ టన్నుల వరి ధాన్యాన్ని రైతుల నుంచి కొనుగోలు చేయనున్నట్లు అడిషనల్ కలెక్టర్ వేణుగోపాల్ తెలిపారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వ్యవసాయ శాఖ అధికారులు, వ్యవసాయ విస్తరణ అధికారులు నాణ్యత ప్రమాణాల ప్రకారం పరిశీలించి, అర్హమైన ధాన్యానికి మాత్రమే కొనుగోలు పత్రాలు, టోకెన్లు జారీ చేయాలని సూచించారు. ధాన్యం కొనుగోలుపై శనివారం రైస్ మిల్లర్లు, ఎఫ్‌సిఐ, సంబంధిత శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వరి కొనుగోలు ప్రక్రియను పారదర్శకంగా, అప్రమత్తతతో నిర్వహించేందుకు సంబంధిత అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ సందర్భంగా రైస్ మిల్లర్లు రైతులు తెస్తున్న పిఆర్-126 వరి రకం పట్ల అసంతృప్తి వ్యక్తం చేసిన విషయాన్ని ప్రస్తావించారు. ఈ రకంలో పిన్‌పాయింట్ డ్యామేజ్ సమస్య కారణంగా ఎఫ్‌సీఐ వద్ద బియ్యం ఆమోదం పొందడంలో ఇబ్బందులు తలెత్తుతున్నట్లు తెలియజేశారు. ఈ సమస్యను దృష్టిలో ఉంచుకుని సంబంధిత అధికారులు సమన్వయం చేసుకొని ఎఫ్‌సీఐ వద్ద బియ్యం సజావుగా ఆమోదం పొందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. రైస్ మిల్లర్లు తమ మిల్లుల వద్ద ధాన్యం దిగుమతికి అవసరమైన హమాలీలు, గోదాం స్థలాలు సిద్ధం చేసుకోవాలని సూచించారు. ఈ సమావేశంలో డీఆర్‌డీఏ పీడీ విద్య చందన, జిల్లా పౌర సరఫరాల అధికారి ఎ. ప్రేమ్ కుమార్, జిల్లా మార్కెటింగ్ అధికారి త్రినాధ్ బాబు, జిల్లా సహకార అధికారి రాజశేఖర్, ఎఫ్‌సీఐ అధికారులు వెంకట రమణ, పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.

# డాక్టర్ సురేష్ నాయక్ మృతికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలి

* గూగులోత్ కిషన్ నాయక్ .



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: మహబూబాద్ జిల్లా కేంద్రంలో డా,, బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు గిరిజన సామాజిక చైతన్య వేదిక గుగులోత్ కిషన్ నాయక్ సారాధ్యంలో ఉస్మానియా మెడికల్ పీజీ విద్యార్థి సురేష్ నాయక్ మృతికి బాధ్యులైన వారిని కఠినంగా శిక్షించాలని కోరుతూ భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ డా,, బి.ఆర్ అంబేద్కర్ విగ్రహం ముందు దళిత గిరిజన ప్రజా సంఘాలతో నిరసన వ్యక్తం చేయడం జరిగింది. మహబూబాబ్ నగర్ జిల్లాకు చెందిన. గిరిజన నిరుపేద కుటుంబానికి చెందిన డా,,సురేష్‌నాయక్ శుక్రవారం ఉదయం ఉస్మానియా మెడికల్ కాలేజీలో పీజీ మొదటి సంవత్సరం చదువుతున్నకు సురేష్‌నాయకును అక్కడున్న సీనియర్లు ప్రతిరోజు కుల వివక్షిత చూయిస్తూ మానసిక వేదనకు గురిచేస్తూ అనేక అవమానాలు చేస్తూ 3 నెలల నుంచి ఎన్నో ఇబ్బందులు పెడుతూన్నా అక్కడ ఉన్నటువంటి హెచ్ ఓ డి, ప్రిన్సిపాల్ హెచ్ ఆర్ సంబంధిత సీనియర్ల పైన ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం లంబాడి విద్యార్థి అయినందునా పట్టించుకోకపోవడం ఆయన మృతి కారణమైంది. తక్షణమే నిర్లక్ష్యం వహించినా ప్రిన్సిపాల్ హెచ్ ఓ డి హెచ్ ఆర్ , సీనియర్ విద్యార్థుల పైన ఎస్సీ ,ఎస్టీ, అట్రాసిటీ కేసుతో పాటు ర్యాగింగ్ చట్టంతో పాటు హత్య నేరం చట్టం కేసులన్ని పెట్టి కఠినంగా శిక్షించాలని, మృతి చెందిన నిరుపేద మెడికల్ విద్యార్థి సురేష్ కుటుంబానికి ఆదుకోవాలని వారి ఇంట్లో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నాం.మూడు సంవత్సరాల క్రితం కూడా వరంగల్లోని కాకతీయ మెడికల్ కాలేజీలో డా,,ప్రీతి అనే లంబాడి ముద్దుబిడ్డను కూడా వేధింపులకు గురిచేసి మృతికి కారకులైన వారి పై ఆ సంఘటన మీద కూడా నేటికి ఎటువంటి చర్యలు లేవు కావున ప్రభుత్వం బాధ్యత వహిస్తూ చనిపోయిన సురేష్ కుటుంబానికి ఆదుకోవాలని, లేకుంటే రాష్ట్ర వ్యాప్తంగా గిరిజన సంఘాలు ప్రజాయుద్ధం తప్పదు.ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ డివిజన్ కార్యదర్శి హలవత్ లింగన్న, గిరిజన సంఘం జిల్లా అధ్యక్షులు బానోత్ వెంకన్న, ఎల్ హెచ్ పి ఎస్ జిల్లా అధ్యక్షులు బోడ రమేష్ నాయక్, అడ్వకేట్ భూఖ్య మోహన్, ఎమ్మార్పీఎస్ రాష్ట్ర నాయకులు సురుగు ఐలయ్, డిహెచ్పిఎస్ జిల్లా అధ్యక్షులు పోలిపాక ఎంకన్న,భూక్య రాజేష్,లకవతి కిషన్, కిస్తూ,చందు,రవితేజ తదితరులు పాల్గొన్నారు.

# ధాన్యం సేకరణలో రైస్ మిల్లర్లు పూర్తి సహకారం అందించాలి

* అధికారులు మిల్లర్లతో రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ కోదండ రెడ్డి సమీక్ష



నల్లగొండ, ప్రజాస్ఫూర్తి : రబీ ధాన్యం సేకరణ మార్గదర్శకాలను పాటించడంలో రైస్ మిల్లర్లు పూర్తి సహకారం అందించాల్సిన అవసరం ఉందని రాష్ట్ర వ్యవసాయ, రైతు సంక్షేమ కమిషన్ చైర్మన్ ఎం. కోదండ రెడ్డి అన్నారు.శనివారం ఆయన నల్గొండ కలెక్టర్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో రైస్ మిల్లర్లు, రైతు సంఘాల ప్రతినిధులు ,ధాన్యం సేకరణ అధికారులతో సమీక్ష నిర్వహించారు .రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా రైతులకు అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, రైతుబంధు, రైతు బీమా తో పాటు, కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి ధాన్యాన్ని కొనుగోలు చేస్తున్నదని, అందువల్ల ధాన్యం కొనుగోలులో ఎట్టి పరిస్థితులలో రైతుని ఇబ్బంది పెట్టడానికి వీలు లేదని అన్నారు . ఎఫ్ సి ఐ నిబంధనల ప్రకారమే ధాన్యం కొనుగోలు నిర్వహించడం జరుగుతున్నదని, అయితే రైతుకు, మిల్లర్లకు ఎలాంటి సంబంధం ఉండదని, కొనుగోలు కేంద్రానికి రైతుకు మాత్రమే సంబంధం ఉంటుందని, ఈ విషయంలో రైస్ మిల్లర్లు రైతులను ఇబ్బంది పెట్టకూడదని కోరారు. తాలు, తరుగు వంటి సమస్యలు ఉంటే సంబంధిత అధికారుల ద్వారా చర్చించి పరిష్కరించుకోవాలని ఆయన మిల్లర్ల కు సూచించారు.హరిత విప్లవం తర్వాత పెద్ద ఎత్తున ధాన్యం వస్తున్నందున ప్రతి సంవత్సరం సమస్యలు పెరుగుతున్నాయని, దీనిని దృష్టిలో ఉంచుకొని రైతులు సంప్రదాయ పంటల వైపు మళ్లాల్సిన అవసరం ఉందని అన్నారు. ఒకప్పుడు నల్గొండ జిల్లాలో 4 లక్షలు ఎకరాలలో బత్తాయి పండించగా, అది ఇప్పుడు 40 వేల ఎకరాలకు పడిపోయిందని, తిరిగి బత్తాయిపండించాలని,రైతులు సంఘటితంగా ఉండేందుకు రైతు ఉత్పాదక సంస్థలను ఏర్పాటు చేయాలని, రైతు ఎప్పుడు ఒంటరివాడిగా ఉండకూడదని అన్నారు..రైతు కమిషన్ సభ్యులు చెవిటి వెంకన్న, నల్గొండ మార్కెట్ కమిటీ చైర్మన్ జూకూరి రమేష్,, రైతు కమిషన్ మెంబర్ సెక్రెటరీ గోపాల్ మాట్లాడారు.సమావేశం ప్రారంభమైన వెంటనే రెవెన్యూ. అదనపు కలెక్టర్ జె. శ్రీనివాస్ మాట్లాడుతూ నల్గొండ జిల్లాలో ఈ యసంగి లో 5,58,000 ఎకరాలలో వరి పంట సాగు చేయడం జరిగిందని, ఇందులో 3,80,000 ఎకరాలలో దొడ్డు ధాన్యం, లక్ష 70 వేల ఎకరాలలో సన్న ధాన్యం సాగు చేశారని, మొత్తం 14 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం మార్కెట్ కు వస్తుందని అంచనా వేయడం జరిగిందని, ఇందుకుగాను జిల్లా వ్యాప్తంగా 439 కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసేందుకు చర్యలు తీసుకున్నామని, గత సంవత్సరంతో పోలిస్తే 136 కేంద్రాలు అధికంగా ప్రతిపాదించామని,ఇప్పటివరకు 330 కేంద్రాలు ప్రారంభించి 50 వేల మెట్రిక్ టన్నులు కొనుగోలు చేసినట్లు అయిన వెల్లడించారు. మిల్లర్లు సమస్య వల్ల అన్లోడ్ కొంచెం ఆలస్యమైందని, శుక్రవారం చర్చల అనంతరం ఈ సమస్య పరిష్కారం అయిందని, ఇక అన్లోడ్ వేగవంతం అయ్యేందుకు ఆస్కారం ఉన్నట్లు ఆయన తెలిపారు..అనంతరం చైర్మన్ కోదండ రెడ్డి మీడియా ప్రతినిధులతో మాట్లాడుతూ ధాన్యం సేకరణలో ఎవరు రైతులను ఇబ్బంది పెట్టకూడదు అన్నది తమ ఉద్దేశమని ,అందువల్ల ప్రతి ఒక్కరూ రైతుకు సహకరించి సజావుగా ధాన్యం సేకరణ జరిగేలా చూడాలని కోరారు. అంతకుముందు చైర్మన్ సమీక్ష నిర్వహించేందుకు జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాగా జిల్లా కలెక్టర్ బి. చంద్రశేఖర్ చైర్మన్ కు పుష్పగుచ్చం అందజేసి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ధాన్యం కొనుగోలు పై చర్చించారు. ఈ సందర్భంగా చైర్మన్ భూభారతి పెండింగ్ దరఖాస్తులు, సాదా బైనామాల వివరాలను జిల్లా కలెక్టర్ ద్వారా అడిగి తెలుసుకున్నారు.జిల్లా కలెక్టర్ బి చంద్రశేఖర్ మాట్లాడుతూ మార్చి 15 వరకు భూభారతి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించామని మాత్రమే ఉన్నాయని సాదా బై నామ కేసులను ఎప్పటికప్పుడు పరిష్కరిస్తున్నట్లు తెలిపారు .ఆదర్శ రైతు రామిరెడ్డి ,రైస్ మిల్లర్ల సంఘం మిర్యాలగూడ కార్యదర్శి శ్రీనివాస్, నల్గొండ కార్యదర్శి భద్రాద్రి రాములు, మిల్లర్ల సమస్యలను సమావేశం దృష్టికి తీసుకువచ్చారు. డిఆర్డిఓ శేఖర్ రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి శ్రవణ్ కుమార్, తదితరులు ఈ సమావేశానికి హాజరయ్యారు.

# విద్యతోనే సమాజ మార్పు...

* వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ...



అందోలు, ప్రజాస్ఫూర్తి : విద్యే సమాజాన్ని మార్చే శక్తివంతమైన ఆయుధమని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. శనివారం అందోల్ నియోజకవర్గంలో నిర్వహించిన సుడిగాలి పర్యటనలో భాగంగా విద్యా అభివృద్ధి, మౌలిక వసతుల పెంపుపై ఆయన దృష్టి సారించారు. శివంపేట పాలిటెక్నిక్ కళాశాలలో న్యూ హాలాండ్ పరిశ్రమ సిఎస్ఆర్ నిధులు రూ. 43 లక్షలతో నిర్మించిన మెకానికల్ వర్క్‌షాప్ షెడ్‌ను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్యతో కలిసి మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ విద్యతోనే జీవితాల్లో వెలుగులు నిండుతాయని, అందోల్ నియోజకవర్గాన్ని ఎడ్యుకేషన్ హబ్‌గా తీర్చిదిద్దేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు.నియోజకవర్గంలో ఇప్పటికే పాలిటెక్నిక్, జేఎన్టీయూ ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, వ్యవసాయ, మహిళా కళాశాలలతో పాటు మోడల్, రెసిడెన్షియల్, కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. బాలికల భద్రత, వసతుల విషయంలో రాజీ లేదని స్పష్టం చేశారు. సిఎస్ఆర్ నిధులు రూ. 10 కోట్ల తో నియోజకవర్గంలోని విద్యాసంస్థలలో మౌలిక వసతుల మెరుగుదల పనులు చేపడుతున్నట్లు వివరించారు. ఇదిలా ఉండగా, మంత్రి తన పర్యటనలో భాగంగా రూ. 27.76 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించారు. అందోల్‌లో రూ. 1.80 కోట్లతో నిర్మించిన విద్యుత్ ఉపకేంద్రాన్ని ప్రారంభించగా, చెరువు కట్ట వద్ద రూ. 5 కోట్లతో నిర్మించనున్న పర్యాటక రెస్టారెంట్‌కు శంకుస్థాపన చేశారు. అలాగే రూ. 20 కోట్లతో నిర్మించనున్న ప్రభుత్వ కార్యాలయాల సముదాయం పనులను ప్రారంభించారు. రూ. 53 లక్షలతో నిర్మించిన గ్రంథాలయ భవనం మొదటి అంతస్తును ప్రారంభించారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య మాట్లాడుతూ, విద్యార్థులు విద్యతో పాటు నైపుణ్యాలను అభివృద్ధి చేసుకుంటే ఉపాధి అవకాశాలు విస్తృతమవుతాయని సూచించారు. పాలిటెక్నిక్ విద్యార్థులు ఉన్నత విద్యతో పాటు ఉద్యోగ అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమం అదనపు కలెక్టర్ పాండు, అందోలు జోగిపేట మున్సిపల్ చైర్మన్ కృష్ణారెడ్డి, వైస్ చైర్మన్ చిట్టిబాబు తో పాటు అధికారులు,ప్రజా ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక వారం రోజుల కార్యక్రమం

* రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు



మహబూబాబాద్ జిల్లా, ప్రజాస్ఫూర్తి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమంలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుండి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు సంక్షేమ వారాన్ని సమర్థవంతంగా నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు అన్నారు.శనివారం, హైదరాబాద్ నుంచి ఉన్నతాధికారులతో కలిసి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా అన్ని జిల్లాల కలెక్టర్లు, అదనపు కలెక్టర్లు, సంక్షేమ శాఖల అధికారులతో సంక్షేమ వారం నిర్వహణపై సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలోని వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ లెనిన్ వత్సల్ టొప్పో తో కలిసి జిల్లా కలెక్టర్ స్నేహ శబరీష్ ఈ వీడియో కాన్ఫరెన్స్ కు హాజరయ్యారు.ఈ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి మాట్లాడుతూ 99 రోజుల ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రభుత్వ వసతి గృహాలు, గురుకుల పాఠశాలలు,ఆశ్రమ పాఠశాలలలో షెడ్యూల్డ్ కులములు, షెడ్యూల్డ్ తెగలు, వెనుకబడిన తరగతులు, మైనారిటీ గురుకులాల్లో, విద్యాలయాల్లో పారిశుద్ధ్య పనులు చేపట్టాలని తెలిపారు.విద్యార్థులకు క్విజ్, విద్య విశ్లేషణ, చిత్రలేఖనం, పెయింటింగ్ పోటీలు నిర్వహించాలని,వసతి గృహాల్లో మరమ్మతు పనులను చేపట్టాలని తెలిపారు.విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించి, వసతులపై చర్చించాలని సూచించారు. స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, వేసవి శిబిరం, బడి బాట కార్యక్రమాలు నిర్వహించాలని, రైతు రిజిస్ట్రీ 100 శాతం పూర్తి చేయాలని తెలిపారు.వీసీ అనంతరం సంబంధిత అధికారులతో జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల ప్రకారం ఈ నెల 20వ తేదీ నుంచి 26వ తేదీ వరకు 7 రోజుల పాటు ప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యాచరణలో భాగంగా చర్యలు తీసుకోవాలని, జిల్లాలోని అన్నీ ఎస్సి, ఎస్టి, బిసి, మైనారిటీ గురుకులాల్లో, వసతి గృహాల్లో వంట గది, పారిశుద్ధ్యం, మరమ్మతు పనులు చేపట్టాలని, విద్యార్థులకు వివిధ విభాగాలలో పోటీలు నిర్వహించాలని, స్కిల్ డెవలప్మెంట్ కార్యక్రమాలు చేపట్టాలని, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులతో సమావేశాలు ఏర్పాటు చేయాలన్నారు.ఈ వీడియో కాన్ఫరెన్స్ లో ట్రైబల్ వెల్ఫేర్ సంచాలకులు దేశీరాం ఇతర సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ లో ఉన్న కూలీల ఫీల్డ్ అసిస్టెంట్ల3నెలల వేతనాలు చెల్లించాలి

* వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిరిపంగిస్వామి



వలిగొండ ప్రజాస్ఫూర్తి : ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీల ఫీల్డ్ అసిస్టెంట్ ల మూడు నెలల పెండింగ్ వేతనాలను వెంటనే చెల్లించాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి సిర్పంగి స్వామి డిమాండ్ చేశారు. శనివారం సుంకిశాల గ్రామంలో ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలతో జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉపాధి హామీ పథకంలో పనిచేస్తున్న కూలీలకు, ఫీల్డ్ అసిస్టెంట్లకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వకుండా కేంద్ర ప్రభుత్వం వ్యవహరించడం దుర్మార్గమని వెంటనే వారి వేతనాలను చెల్లించాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం అనేక షరతులతో ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తూ కూలీలకు పనులు లేకుండా చేసే చర్యలకు శ్రీకారం చుట్టిందన్నారు. ఉదయం మధ్యాహ్నం తోపాటు గ్రూప్ వారిగా మూడు సార్లు ఫోటో క్యాప్చర్ లతో కూలీలు తీవ్రమైన ఇబ్బందులు పడుతున్నారని, వెంటనే విధానాన్ని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. కూలీలు పనులు చేసే ప్రదేశంలో ప్రభుత్వం చింటూ మంచినీళ్లు సౌకర్యాల్ని కల్పించడం లేదని కూలీలే మంచినీటిని తీసుకుపోయిన మంచినీటికి ఇవ్వవలసిన డబ్బులను చెల్లించడం లేదని కూలీలను ఇబ్బందులకు గురిచేసి పనులకు ఎవరు రాకుండా చేయాలని ప్రభుత్వ కుట్ర సరైంది కాదని, ఈ అన్ని సమస్యలపై ఈనెల 21వ తేదీన తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఎంపీడీవో, తహసిల్దార్, ఉపాధిహామీ కార్యాలయాల ముందు ధర్నాలకు పిలుపునిచ్చిందని, 21వ తేదీన జరిగే ధర్నాలో కూలీలందరూ పాల్గొని జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు.ఈ సమావేశంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు మంగ బాలయ్య, ఈర్లపల్లి నరసింహ,ఐలేపల్లి స్వామి, వ్యవసాయ కూలీలు లక్ష్మమ్మ, అలివేలు, అనురాధ, వెంకటమ్మ, పవిత్ర,మంజుల, సునీత, అండాలు,పద్మ,రజిత,అశ్విని,హేమలత,సునీత,తదితరులు పాల్గొన్నారు.

# ట్రాఫిక్ నియమాలను పాటించాలి: డిఎస్పీ ఆదినారాయణ



ప్రజాస్ఫూర్తి, కొత్తగూడెం: ప్రతి ఏడాది ప్రకృతి వైపరీత్యాలలో మరణించే వారి కంటే రోడ్డు ప్రమాదాలలో మరణించే వారి సంఖ్య పెరుగుతుందని కొత్తగూడెం డీఎస్పీ ఆదినారాయణ అన్నారు. రోడ్డు భద్రత నియమాలను పాటించడంలో ప్రతి ఒక్కరూ స్వీయ క్రమశిక్షణ కలిగి ఉండాలని కోరారు. కొత్తగూడెం త్రీ టౌన్ పోలీసులు శనివారం రైల్వే స్టేషన్ ప్రాంగణంలో టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా కొత్తగూడెం డిఎస్పి ఆదినారాయణ పాల్గొన్నారు. ప్రజాపాలన - ప్రగతి ప్రణాళిక 99 రోజుల కార్యక్రమాలలో భాగంగా రోడ్డు ప్రమాదాలను అరికట్టడానికి నిర్వహిస్తున్న అరైవ్-అలైవ్ ప్రోగ్రాంలో వాహనదారులకు స్వీట్లు, పండ్లు పంపిణీ చేసి రోడ్డు భద్రత నియమాలను పాటించాలని త్రీ టౌన్ పోలీసులు వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న డిఎస్పి ఆదినారాయణ మాట్లాడుతూ హెల్మెట్, సీటు బెల్ట్ ధరించడం వలన ప్రాణాలను కోల్పోకుండా ప్రమాదాల నుండి బయటపడవచ్చని సూచించారు. ప్రజల భద్రత, శ్రేయస్సు కోసమే పోలీస్ శాఖ నిరంతరం కృషి చేస్తుందని అన్నారు. ప్రతి ఒక్కరూ రోడ్డు భద్రతా నియమాలను పాటించి బాధ్యతగల పౌరులుగా మెలగాలని ఈ సందర్భంగా విజ్ఞప్తి చేశారు. అనంతరం రోడ్డు భద్రతా నియమాలను పాటిస్తామని ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రతి ఒక్కరూ ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కొత్తగూడెం టూ టౌన్ ఇన్స్పెక్టర్ ప్రతాప్, వన్ టౌన్ ఇన్స్పెక్టర్ కరుణాకర్, త్రీ టౌన్ ఇన్స్పెక్టర్ ఇంద్రసేనారెడ్డి, ట్రాఫిక్ ఎస్ఐ ప్రవీణ్, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# 18 రోజుల్లో 2.83 లక్షల ట్యాంకర్ బుకింగ్స్..

* **జలమండలి ఎండీ అశోక్ రెడ్డి**




హైదరాబాద్ : అత్యధిక జనాభా, బహుళా అంతస్తుల భవనాలు ఉన్న ఏరియాలైన ఎస్ఆర్ నగర్, జూబ్లీహిల్స్, అయ్యప్ప సొసైటీ, మాదాపూర్, మణికొండ, కూకట్ పల్లి డివిజన్ లలోనే అత్యధికంగా ట్యాంకర్లు బుకింగ్ అవుతున్నాయని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి తెలిపారు. శనివారం ఖైరతాబాద్ లోని జలమండలి బోర్డు కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో జలమండలి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు ఎన్. పంకజ, అశోక్ సామ్రాట్, సంతోష్ లతో కలిసి ఆయన మాట్లాడారు. ఎండకాలం రాగానే కొన్ని ప్రాంతాల్లో మాత్రమే వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ పెరుగుతుందని, రికార్డు స్థాయిలో బుకింగ్ లు వస్తున్నట్లు ఆయన వెల్లడించారు. 2021 జనవరి, ఫ్రబవరి మాసాల్లో సుమారు 52 వేల వాటర్ ట్యాంకర్ బుకింగ్ లు రాగా, 2026 జనవరి, ఫిబ్రవరి మాసాల్లో అది కాస్త లక్షా 8 వేలకు పెరిగి, రెండింతలైందని ఆయన వివరించారు. ఒకే సారి కొన్ని ప్రాంతాల నుంచి వాటర్ ట్యాంకర్లకు డిమాండ్ వస్తుండటంతో గతేడాది తాము స్టడీ నిర్వహించి, వాస్తవాలను గుర్తించామన్నారు. ఈ ఆరు ప్రాంతాల్లో భూగర్భ జలాలు పూర్తిగా అడుగంటి పోవడంతోపాటు హైరైజ్డ్ బిల్డింగ్స్ వస్తున్నాయని తెలిపారు. హాస్టళ్లు వంటివి ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు గుర్తించినట్లు తెలిపారు. చాలా ప్రాంతాల్లో కేవలం వంద చదరపు గజాల స్థలంలో ఆరేడు అంతస్తులు నిర్మించి, వాటిని హాస్టళ్లుగా వినియోగిస్తున్నారని, అక్కడ అవసరాలకు తగిన విధంగా డైలీ ట్యాంకర్ల బుకింగ్ లు వస్తూ డిమాండ్ పెరుగుతుందన్నారు. జలమండలికి సుమారు 2 వేల చదరపు కిలోమీటర్ల విస్తీర్ణంలో సుమారు 12 వేల కిలోమీటర్ల పొడువున పైప్ లైన్ వ్యవస్థ ద్వారా దాదాపు 14.50 లక్షల మందికి మంచినీటిని సరఫరా చేస్తున్నామని అశోక్ రెడ్డి తెలిపారు. ఏప్రిల్ మాసంలోని గడిచిన 18 రోజుల్లో సుమారు 2 లక్షల 83 వేల ట్యాంకర్ బుకింగ్ లు వచ్చాయని, వీటిలో దుర్గం చెరువు ప్రాంతం నుంచి గతేడాది ఇదే నెలలో 1వ తేదీ నుంచి ఇప్పటి వరకు 1900 బుకింగ్ లు రాగా ఈ సారి ఆ సంఖ్య 2400కు పెరిగిందని, అలాగే మణికొండలో గత సంవత్సరం ఇదే తేదీ నాటికి 690 ఉండగా, ఇపుడు ఆ సంఖ్య వెయ్యికి పెరిగిందని ఎండీ వివరించారు. వచ్చిన బుకింగ్ లలో 10 నుంచి 15 శాతం బుకింగ్ లు కేవలం నాలుగు ప్రాంతాల నుంచే వచ్చినట్లు గుర్తించామన్నారు. ప్రస్తుతం జలమండలిలో దాదాపు 86 వాటర్ ఫిల్లింగ్ స్టేషన్లు, 1125 వాటర్ ట్యాంకర్లున్నట్లు ఆయన తెలిపారు. 2021 నుంచి అవసరానికి తగిన విధంగా, డిమాండ్ ను బట్టి ఫిల్లింగ్ స్టేషన్లు, వాటర్ ట్యాంకర్ల సంఖ్య ను పెంచుతూ వస్తున్నట్లు ఆయన వివరించారు.

# కాంగ్రెస్ పార్టీ విధానాలకు వ్యతిరేకంగా బిజెపి నిరసన

* **రాహుల్ గాంధీ దిష్టి బొమ్మ దగ్ధాన్ని అడ్డుకున్న పోలీసులు**

హుస్నాబాద్, ప్రజాస్ఫూర్తి : హుస్నాబాద్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తా వద్ద బీజేపీ హుస్నాబాద్ పట్టణ అధ్యక్షుడు బత్తుల శంకర్ బాబు ఆధ్వర్యంలో పార్లమెంటులో ఎన్డీయే కూటమి మహిళా రిజర్వేషన్ బిల్లు ప్రవేశపెట్టగా మహిళా రిజర్వేషన్ బిల్లును వ్యతిరేకించి, వీగిపోయేవిధంగా చేసిన కాంగ్రెస్ పార్టీ ఇండి కూటమి దేశ మహిళలను కించపరిచినందకు నిరసనగా నిరసన కార్యక్రమం నిర్వహించారు. రాహుల్ గాంధీ దిష్టి బొమ్మను దగ్ధం చేసే క్రమంలో పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా బత్తుల శంకర్ బాబు మాట్లాడుతూ ఎన్నో ఏండ్లుగా మహిళలకు చట్టసభల్లో రిజర్వేషన్లు కల్పించాలని ఎన్డీయే కూటమి ప్రభుత్వం,



వాజపేయి నరేంద్ర మోదీ మహిళా రిజర్వేషన్ ,సాధికారత కోసం పాటుపడింది. కానీ కాంగ్రెస్ పార్టీ, మిత్రా పక్షాలు మహిళా రిజర్వేషన్ బిల్లును ఆనాదిగా వ్యతిరేకిస్తూ మహిళలను కించపరుస్తూ మహిళలను ఓడగోడుతున్నారని ,కాంగ్రెస్ పార్టీ మహిళల పట్ల వారి స్వభావాన్ని, వైఖరిని అక్కసును వెళ్లబోసుకున్నారు. కాంగ్రెస్ పార్టీ వక్రా బుద్ధిని మహిళామణులు అర్థం చేసుకుని, కాంగ్రెస్ పార్టీని కూకటివేళ్లతో పేకులించి, విసిరి వేయాలని, తగిన బుద్ధి చెప్పాలని కోరారు. చరిత్ర పుటల్లో కాంగ్రెస్ ద్రోహిగా మిగిలిపోతుందని అన్నారు ఈ కార్యక్రమంలో బీజేపీ హుస్నాబాద్ పట్టణ ప్రధాన కార్యదర్శులు, గాదాసు రాంప్రసాద్, పోలోజు రాజేందర్ చారీ, కార్యదర్శి అకోజు అరుణ్ కుమార్, లకవత్ శారద, మల్లం ప్రశాంత్, గౌరవేని మణెమ్మ, శక్తి కేంద్ర ఇంచార్జీ నారోజు నరేష్, బీజేపీ సీనియర్ నాయకులు కవ్వ వేణు గోపాల్ రెడ్డి, కురిమెల్ల శ్రీనివాస్, వరియోగుల అనంతస్వామి, వెల్దండి సంతోష్,పోలోజు రవీందర్ కాదాసు నర్సయ్య, అబ్బిడి లింగారెడ్డి మహిళా నాయకురాలు చిన్మయి, నాయకులు గౌరవేని తిరుపతి, పోగుల శేఖర్, సుద్దాల నరేష్ కుమార్ బత్తుల బాబు తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ప్రజలలో ఎండగట్టాలి

* **రానున్న జెడ్పిటిసి, ఎంపిటిసి ఎన్నికలలో కార్యకర్తలు సైనికుల్లా పని చేయాలి.**
* **20 న జగిత్యాలలో జరిగే బిఆర్ఎస్ బహిరంగ సభను విజయవంతం చేయాలి.**
* **కార్యకర్తల విస్తృత స్థాయి సమావేశంలో మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్.**



హుస్నాబాద్, ఏప్రిల్ 18 : హుస్నాబాద్ నియోజకవర్గ అభివృద్ధి కాంగ్రెస్ ప్రభుత్వ హయాంలో మంత్రి పొన్నం ప్రభాకర్ చేసింది శూన్యమని కేవలం బిఆర్ఎస్ ప్రభుత్వ కాలంలోనే నియోజకవర్గ అభివృద్ధి జరిగిందని దాన్ని పట్టుకొని మేమే అభివృద్ధి చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందని హుస్నాబాద్ మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. హుస్నాబాద్ మండలంలోని పోతారం ఎస్ గ్రామ శివారులో శుభం గార్డెన్ లో శనివారం బిఆర్ఎస్ పార్టీ కార్యకర్తల నియోజకవర్గ కార్యకర్తల విస్తృతస్థాయి స్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి కరీంనగర్ మాజీ ఎంపీ వినోద్ కుమార్ హాజరయ్యారు. అనంతరం పార్టీ కార్యకర్తలను ఉద్దేశించి మాజీ ఎమ్మెల్యే సతీష్ కుమార్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వ 420 హామీలు, ఆరు గ్యారెంటీలను ప్రజలలో తీసుకెళ్లి రానున్న ఎంపీటీసీ జడ్పిటిసి ఎన్నికలలో కార్యకర్తలు సైనికుల పనిచేసి కాంగ్రెస్ పార్టీకి సరియైన గుణపాఠం చెప్పాలని ఆయన పిలుపునిచ్చారు. అదేవిధంగా బిఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో జరిగిన అభివృద్ధిని మేం చేసాము అని చెప్పడం ఎంతవరకు సమంజసమని ఆయన ప్రశ్నించారు. రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ హుస్నాబాద్ అభివృద్ధిని గాలికి వదిలేసి ఇక్కడ ప్రజలకిచ్చిన హామీలను విస్మరించి ప్రజలను మభ్యపెడుతున్నాడని మంత్రిపై మాజీ ఎమ్మెల్యే ఫైర్ అయ్యారు. బిఆర్ఎస్ పార్టీకి పునర్ వైభవం తీసుకొచ్చే విధంగా కార్యకర్తలు,నాయకులు సమన్వయంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.ఈనెల 20న జగిత్యాలలో జరిగే బిఆర్ఎస్ భారీ బహిరంగ సభను విజయవంతం చేయడానికి అన్ని గ్రామాల నుంచి నాయకులు కార్యకర్తలు తరలిరావాలని ఆయన అన్నారు.ఈ విస్తృతస్థాయి సమావేశం తో కార్యకర్తల్లో టిఆర్ఎస్ శ్రేణుల్లో నయా జోష్ కనిపించినట్లయింది.ఈ కార్యక్రమంలో రాష్ట్రస్థాయి టిఆర్ఎస్ నాయకులు నియోజకవర్గ స్థాయి నాయకులు వివిధ గ్రామాల సర్పంచులు అనుబంధ సంఘ నాయకులు పార్టీ కార్యకర్తలు భారీ ఎత్తున పాల్గొన్నారు


# రాష్ట్రంలో ప్రతి ఒక్కరికీ డిజిటల్ హెల్త్ కార్డు.. మంత్రి దామోదర్ రాజనర్సింహ

రాష్ట్రంలో ప్రతి పౌరుడికి డిజిటల్ హెల్త్ ప్రొఫైల్ తయారు చేసి, కార్డులు అందించబోతున్నామని ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహ అన్నారు. ఫలితంగా మరింత మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అవకాశం ఏర్పడుతుందన్నారు. డయాబెటీస్, హైపర్ టెన్షన్, గుండె జబ్బులు, కిడ్నీ జబ్బుల వంటి నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లు ప్రజారోగ్యానికి పెద్ద సవాలుగా మారాయని ఆయన పేర్కొన్నారు. జీవనశైలిలో వచ్చిన మార్పుల వల్ల కిడ్నీలు దెబ్బతిని ఎంతో మంది రోగులుగా మారుతున్నారని తెలిపారు. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఈ సమస్య మరింత ఎక్కువగా ఉందని వెల్లడించారు. ఈ నాన్ కమ్యునికెబుల్ డిసీజ్‌లను ఎదుర్కొనేందుకు ప్రజా ఆరోగ్య వ్యవస్థను సిద్ధం చేస్తున్నామని అన్నారు. శనివారం హైదరాబాద్‌లోని మైండ్ స్పేస్‌లో సొసైటీ ఆఫ్ ద రెనల్ న్యూట్రీషన్ అండ్ మెటబాలిజం వార్షిక సదస్సును ఆరోగ్యశాఖ ప్రారంభించారు. వ్యాధి నివారణపై అవగాహన, ఎర్లీ స్టేజ్‌లోనే వ్యాధుల గుర్తింపు, ట్రీట్‌మెంట్, రిహాబిలిటేషన్ వరకూ సమగ్రంగా ఆరోగ్య వ్యవస్థను తీర్చిదిద్దుతున్నామని తెలిపారు. ప్రతి జిల్లాలో ఎన్సీడీ క్లినిక్స్ ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాల్లోనే కీమో థెరపీ అందించేలా అన్ని జిల్లా కేంద్రాల్లో డే కేర్ కేన్సర్ సెంటర్లు ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. రీజనల్ రిఫరల్ సెంటర్లు ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. రాష్ట్రంలో 46 లక్షల స్వయం సహాయక సంఘాల మహిళలకు 30 రకాల ఉచిత పరీక్షలు నిర్వహిస్తున్నామని అన్నారు. అందులో సీరమ్ క్రియాటినిన్ పరీక్ష కూడా ఉందని... కిడ్నీ వ్యాధిని ప్రాథమిక దశకో గుర్తించేందుకు ఇది ఉపయోగపడుతుందన్నారు.

# తెరిచినట్టా.. మూసినట్టా..

# హర్మ్యాజ్ వద్ద గందరగోళం.. కదలని నౌకలు!

* **జలసంధి తెరిచినా కొనసాగుతున్న ఉద్రిక్తతలు**
* **ఇరాన్ తనిఖీలు, అమెరికా పహారాతో నెలకొన్న గందరగోళం**
* **మార్గంలో ముందుకు కదలని వందలాది చమురు ట్యాంకర్లు**
* **బీమా కంపెనీల వెనకడుగుతో షిప్పింగ్ సంస్థల ఆందోళన**



టెహ్రాన్/వాషింగ్టన్, ఏప్రిల్ 18 : ప్రపంచ ఇంధన రవాణాకు జీవనాడిగా భావించే హర్మ్యాజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తత, గందరగోళం నెలకొన్నాయి. ఇజ్రాయెల్, లెబనాన్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో హర్మ్యాజ్ జలసంధిని తెరుస్తున్నట్లు ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చీ శుక్రవారం ప్రకటించారు. లెబనాన్ లో కాల్పుల విరమణ అమలులో ఉన్నంత కాలం హర్మ్యాజ్ తెరిచే ఉంటుందని, అన్ని దేశాల నౌకలు రాకపోకలు సాగించవచ్చని చెప్పారు. అయితే, ఇస్లామిక్ రివల్యూషనరీ గార్డ్స్ కోర్ (ఐఆర్ జీసీ) నిర్దేశించిన మార్గంలోనే నౌకలు రాకపోకలు సాగించాల్సి ఉంటుందని అరాఘ్చీ షరతు విధించారు. హర్మ్యాజ్ తెరిచామంటూ ఇరాన్ మంత్రి చేసిన ప్రకటనను అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వాగతించారు. ఇందుకు ఇరాన్ కు ఆయన థ్యాంక్స్ కూడా చెప్పారు. అయితే, హర్మ్యాజ్ జలసంధిపై అమెరికా నేవీ కొనసాగిస్తున్న బ్లాకేడ్ అలాగే ఉంటుందని చెప్పారు. నౌకల రాకపోకలపై తమ పర్యవేక్షణ కొనసాగుతుందని స్పష్టం చేశారు. ఇదిలావుంచితే, హర్మ్యాజ్ తెరిచామని ఇరాన్, అమెరికా ప్రకటించినా క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం అందుకు భిన్నంగా ఉన్నాయి. కఠిన నిబంధనలు, ఇరు దేశాల మధ్య అపనమ్మకం కారణంగా వందలాది చమురు, సరకు రవాణా నౌకలు సముద్రంలోనే నిలిచిపోయాయి. కొన్ని రోజుల క్రితం ఇరాన్ ఈ జలసంధిని మూసివేయడంతో అంతర్జాతీయ ఒత్తిడి పెరిగింది. చర్చల అనంతరం మార్గాన్ని పునఃప్రారంభించేందుకు ఇరాన్ అంగీకరించింది. అయితే, ఈ మార్గంలో ప్రయాణించే ప్రతి నౌకను తమ రివల్యూషనరీ గార్డ్స్ (ఐఆర్ జీసీ) క్షుణ్ణంగా తనిఖీ చేస్తామని షరతు విధించింది. ఈ తనిఖీల పేరుతో జరుగుతున్న జాప్యం, కఠిన వైఖరి నౌకాయాన సంస్థలను ఆందోళనకు గురిచేస్తోంది. మరోవైపు, అమెరికా తన మిత్రదేశాల నౌకలకు రక్షణగా యుద్ధ నౌకలను రంగంలోకి దించింది. ఇరాన్ నిబంధనలను అమెరికా వ్యతిరేకిస్తుండటంతో ఇరు పక్షాల మధ్య ఘర్షణ వాతావరణం నెలకొంది. దీనికి తోడు, ఈ మార్గంలో ప్రయాణించే నౌకలకు బీమా కవరేజీ ఇచ్చేందుకు కంపెనీలు వెనుకాడుతున్నాయి. కొన్ని సంస్థలు ప్రీమియంలను భారీగా పెంచడంతో ఓడల యజమానులు ముందుకు సాగేందుకు సాహసించడం లేదు. 'మార్గం తెరిచామని ఇరాన్ చెబుతున్నా, క్షేత్రస్థాయిలో యుద్ధ వాతావరణం ఉంది. చిన్న పొరపాటు జరిగినా పరిస్థితి చేయి దాటిపోతుంది' అని ఓ ప్రముఖ షిప్పింగ్ ఏజెంట్ ఆందోళన వ్యక్తం చేశారు. ప్రపంచ చమురు రవాణాలో 20% వాటా ఉన్న ఈ జలసంధి వద్ద ప్రతిష్టంభన కొనసాగితే ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై తీవ్ర ప్రభావం పడే ప్రమాదం ఉంది.

# ఎన్డీయే వైఫల్యానికి ఇది నిదర్శనం

**: ప్రియాంకా గాంధీ**

* **మహిళా రిజర్వేషన్ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై ప్రియాంక ఆసక్తికర వ్యాఖ్యలు**
* **ఇది ప్రజాస్వామ్యానికి దక్కిన పెద్ద విజయమని వ్యాఖ్య**
* **ప్రతిపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చాయన్న ప్రియాంక**



న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: లోక్‌సభలో మహిళా రిజర్వేషన్ రాజ్యాంగ సవరణ బిల్లు ఆమోదం పొందకపోవడంపై కాంగ్రెస్ ఎంపీ ప్రియాంకా గాంధీ కీలక వ్యాఖ్యలు చేశారు. ఈ బిల్లు వీగిపోవడాన్ని ఆమె ప్రజాస్వామ్యానికి దక్కిన అతిపెద్ద విజయంగా అభివర్ణించారు. ప్రభుత్వం తీసుకొచ్చిన ఈ బిల్లు అసలు మహిళల హక్కుల కోసమో లేదా డీలిమిటేషన్ కోసమో తెచ్చింది కాదని ఆమె విమర్శించారు. విపక్షాలన్నీ ఏకతాటిపైకి వచ్చి ప్రభుత్వ వ్యూహాన్ని తిప్పికొట్టాయని, తద్వారా లోక్‌సభలో అధికార పక్షాన్ని ఓడించగలిగామని ఆమె పేర్కొన్నారు. ఎన్డీయే ప్రభుత్వానికి ఇది ఒక 'చీకటి రోజు' అని ప్రియాంక వ్యాఖ్యానించారు. కేంద్ర ప్రభుత్వం ప్రతిపాదించిన ఒక కీలక బిల్లు లోక్‌సభలో ఓడిపోవడం ఇదే తొలిసారి అని, ఇది వారి వైఫల్యానికి నిదర్శనమని ధ్వజమెత్తారు. మహిళా రిజర్వేషన్ల పేరుతో ప్రభుత్వం ఆడుతున్న రాజకీయ క్రీడను ప్రజలు గమనిస్తున్నారని, విపక్షాల ఐక్యత ఈ ఓటమి ద్వారా స్పష్టమైందని ఆమె పునరుద్ఘాటించారు.

# దొరికినట్టే దొరికి తప్పించుకున్న నిదా ఖాన్..

# టీసీఎస్ నాసిక్ కేసులో కీలక పరిణామం

నాసిక్, ఏప్రిల్ 18: టీసీఎస్ నాసిక్ వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదా ఖాన్ ఆచూకీ వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. ఆమె భర్త స్వయంగా ఆచూకీ చెప్పినప్పటికీ, పోలీసుల రాకను పసిగట్టిన నిదా ఖాన్ అక్కడి నుంచి పరారైంది. దీంతో ఈ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. విచారణలో భాగంగా పోలీసులు నిదా ఖాన్ భర్తను ప్రశ్నించగా, ఆయన పోలీసులకు సహకరించాడు. తన భార్య ప్రస్తుతం ఎక్కడ ఉంటోందో స్పష్టమైన సమాచారం అందించాడు. ఆ లొకేషన్ ఆధారంగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అయితే, వారు వెళ్లేసరికే ఆ ఇంటికి తాళం వేసి ఉండటంతో అధికారులు అవాక్కయ్యారు. పోలీసులు వస్తారని



ఊహించి నిదా ఖాన్ అక్కడి నుంచి తప్పించుకుంది. టీసీఎస్‌లో హెచ్ ఆర్ విభాగంలో పనిచేసిన నిదా ఖాన్ పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. టీమ్ లీడర్లు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైపెచ్చు నిందితులకు మద్దతుగా నిలిచిందని, మతం మారాలంటూ బాధితులపై ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులను టార్గెట్ చేసి బలవంతంగా మతమార్పిడులకు పాల్పడేందుకు పథకం ప్రకారమే నిదా ఖాన్ వ్యవహరించిందని అనుమానిస్తున్నారు. బాధితుల ఫిర్యాదుతో పోలీసులు మొత్తం 9 ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడిన టీమ్ లీడర్లను అరెస్టు చేశారు. అయితే, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న నిదా ఖాన్ మాత్రం పరారీలో ఉంది. దీంతో ఆమె కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిదా ఖాన్ తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో ఆమెను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. ఆమెకు ఎవరైనా ఆశ్రయం కల్పిస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితురాలి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల్లో సైతం గాలింపు చర్యలు చేపట్టారు.





# మాజీ ఉప ముఖ్యమంత్రికే గన్ గురిపెట్టిన ఆగంతకుడు.. గురుగ్రామ్‌లో హైడ్రామా

* **హరియాణా మాజీ డిప్యూటీ సీఎం దుష్యంత్ చౌతాలా కారును అడ్డగించి బెదిరింపులు**
* **దాడికి పాల్పడిన వ్యక్తి పోలీసు వాహనంలో రావడంతో అనుమానాలు**
* **ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్**
* **కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టిన గురుగ్రామ్ పోలీసులు**

గురుగ్రామ్: హర్యానా మాజీ ఉప ముఖ్యమంత్రి, జననాయక్ జనతా పార్టీ (జేజేపీ) అధినేత దుష్యంత్ చౌతాలాకు తృటిలో పెను ప్రమాదం తప్పింది. గురుగ్రామ్‌లో ఆయన ప్రయాణిస్తున్న కారును అడ్డగించిన ఓ వ్యక్తి, నేరుగా ఆయనపైకి పిస్టల్ గురిపెట్టడం రాష్ట్రవ్యాప్తంగా సంచలనం సృష్టిస్తోంది. ఈ ఘటనతో హర్యానా రాజకీయాల్లో ఒక్కసారిగా వేడి రాజుకుంది. వివరాల్లోకి వెళితే.. దుష్యంత్ చౌతాలా తన కారులో వెళుతుండగా పోలీసు వాహనం అడ్డగించింది. అందులో నుంచి ఓ వ్యక్తి కిందికి దిగి తన వద్ద ఉన్న పిస్టల్ తో కారు లోపల ఉన్న చౌతాలాకు గురిపెట్టాడు. దీంతో అక్కడున్న వారంతా ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. వెంటనే అప్రమత్తమైన చౌతాలా భద్రతా సిబ్బంది, అనుచరులు ఆ వ్యక్తిని పట్టుకునేందుకు ప్రయత్నించారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో దుమారం రేగింది. 'పోలీసు వేషంలో గూండాలు' అనే హ్యాష్‌ట్యాగ్‌తో నెటిజన్లు, జేజేపీ కార్యకర్తలు తీవ్రంగా స్పందిస్తున్నారు. నిందితుడి ప్రవర్తన, తీరు చూస్తుంటే అతను నకిలీ పోలీసు అయిఉండవచ్చని అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. మాజీ ఉప ముఖ్యమంత్రికే రక్షణ లేకపోతే సామాన్యుల పరిస్థితి ఏంటని విపక్షాలు ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తున్నాయి.

# దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత నేను తీసుకుంటా: సీఎం రేవంత్ రెడ్డి

- **2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును ప్రవేశపెడితే ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ**
- **మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమన్న రేవంత్ రెడ్డి**
- **డీలిమిటేషన్ పేరుతో బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలని కుట్ర చేసిందని ఆగ్రహం**


న్యూఢిల్లీ, ఏప్రిల్ 18: 2023 నాటి మహిళా రిజర్వేషన్ బిల్లును పార్లమెంటులో ప్రవేశపెడితే, దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యతను తాను తీసుకుంటానని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అన్నారు. ఉత్తరప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల లోపు నాటి మహిళా రిజర్వేషన్‌ను అమలు చేస్తే మద్దతిచ్చేందుకు తాము సిద్ధంగా ఉన్నామని అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లుకు కాంగ్రెస్ వ్యతిరేకమన్నది అబద్ధమని పేర్కొన్నారు. ప్రస్తుతం ఢిల్లీ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శనివారం ఉదయం కాంగ్రెస్ పెద్దలను కలిసి బిల్లు వీగిపోయినందుకు ధన్యవాదాలు తెలిపారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, 131వ రాజ్యాంగ సవరణ బిల్లు లోక్ సభలో వీగిపోవడంతో దేశానికి పెద్ద ప్రమాదం తప్పిందని వ్యాఖ్యానించారు. బిల్లు వీగిపోవడం రాజకీయ ఓటమి కాదని, బీజేపీ విధానాలకు జరిగిన ఓటమి అని అభివర్ణించారు.



ఎన్డీయే మూడు బిల్లుల పేరుతో డీలిమిటేషన్ అమలుకు కుట్ర చేసిందని ఆరోపించారు. దక్షిణ భారతదేశానికి జరిగే అన్యాయాన్ని అడ్డుకుంటామని అన్నారు. మహిళా రిజర్వేషన్లను చిన్న సవరణలతో అమలు చేయవచ్చని అన్నారు. బీజేపీకి 400కు పైగా సీట్లు వస్తే రాజ్యాంగాన్ని మార్చేదని ఆరోపించారు. మహిళా రిజర్వేషన్లకు తాము వ్యతిరేకం కాదని పునరుద్ఘాటించారు. సోమవారం ప్రత్యేక పార్లమెంట్ సమావేశాలను ఏర్పాటు చేసి కేవలం మహిళా రిజర్వేషన్ బిల్లును మాత్రమే పెడితే ఇండియా కూటమి ఏకగ్రీవంగా మద్దతిచ్చేందుకు సిద్ధంగా ఉందని అన్నారు. దక్షిణాది రాష్ట్రాలను ఒప్పించే బాధ్యత తనదేనని తెలిపారు. మహిళా రిజర్వేషన్లలో కూడా ఓబీసీ, ఎస్సీ, ఎస్టీ కోటాలు ఉండాలని కోరారు. డీలిమిటేషన్ పేరుతో ఉత్తరాది, దక్షిణాది మధ్య చిచ్చుపెట్టవద్దని ముఖ్యమంత్రి కోరారు. డీలిమిటేషన్ పేరుతో లోక్ సభ సీట్లను 850కి పెంచి బీజేపీ శాశ్వతంగా అధికారంలో ఉండాలనే కుట్ర చేసిందని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీకి రాజకీయాల కంటే దేశమే ముఖ్యమని రేవంత్ రెడ్డి అన్నారు. మహిళా రిజర్వేషన్లను అమలు చేయాల్సిన అవసరం ఉందని అన్నారు. ఇందిరాగాంధీ వంటి గొప్ప నేతలు కాంగ్రెస్ పార్టీ తరపున దేశాన్ని నడిపించారని, బీజేపీ నుంచి ఇప్పటి వరకు మహిళ పార్టీ అధ్యక్షురాలు కాలేదని విమర్శించారు. ప్రతి విషయంలో కాంగ్రెస్ పార్టీ మహిళలకు ప్రాధాన్యత ఇచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు.

## తెలంగాణలో మండుతున్న ఎండలు.. కొమురంభీమ్ జిల్లాలో 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత

- **ఉదయం నుంచే బయటకు రాలేని పరిస్థితులు**
- **నిజామాబాద్ జిల్లాలో 44.5 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు**
- **అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని వాతావరణ శాఖ సూచన**



తెలంగాణ రాష్ట్రంలో భానుడి భగభగతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఉదయం తొమ్మిది గంటల నుంచే బయటకు రాలేని పరిస్థితులు నెలకొన్నాయి. రాష్ట్రంలోని అన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు 40 డిగ్రీలు దాటాయి. కొమురంభీమ్ జిల్లాలోని కెరమెరిలో అత్యధికంగా 44.6 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు హైదరాబాద్ వాతావరణ కేంద్రం తెలిపింది. నిజామాబాద్ జిల్లాలోని మొండోరాలో 44.5 డిగ్రీలు, జగిత్యాల జిల్లా ఎండపల్లిలో 44.4 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. తెలంగాణలోని అన్ని ప్రాంతాల్లో గత సంవత్సరం ఇదే రోజుతో పోలిస్తే ఉష్ణోగ్రతలు మూడు నుంచి నాలుగు డిగ్రీలకు పైగా పెరిగాయి. గత సంవత్సరం ఇదే రోజున అత్యధిక ఉష్ణోగ్రత 43.4 డిగ్రీలు కాగా, ఈ సంవత్సరం నేడు 44.6 డిగ్రీలుగా నమోదైంది. రోజురోజుకు ఎండలు పెరుగుతున్నందున చిన్నారులు, వృద్ధులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వాతావరణ శాఖ సూచించింది. అత్యవసరమైతే తప్ప బయటకు రావొద్దని కోరింది.

## రేవంత్ సభను విజయవంతం చేయాలి: శ్రీధర్ బాబు

- **సోమవారం కాటారంలో సీఎం రేవంత్ కార్యక్రమం**
- **మంథని క్యాంప్ కార్యాలయంలో శ్రీధర్ బాబు సమీక్ష సమావేశం**
- **కార్యక్రమంలో పాల్గొననున్న ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల**

మంథని, ఏప్రిల్ 18:: తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'రైతు భరోసా' నిధుల విడుదల కార్యక్రమాన్ని చారిత్రాత్మక విజయవంతం చేయాలని ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. మంథనిలోని తన క్యాంప్ కార్యాలయంలో మంథని, రామగిరి, కమాన్‌పూర్, ముత్తారం, పాలకుర్తి మండలాల కాంగ్రెస్ ముఖ్య నేతలు,



ప్రజా ప్రతినిధులతో ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. సోమవారం కాటారంలో జరగనున్న ఈ భారీ బహిరంగ సభకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేస్తారని, ఆయనతో పాటు మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, తుమ్మల నాగేశ్వరరావు తదితరులు పాల్గొంటారని వెల్లడించారు. రైతు సంక్షేమమే ధ్యేయంగా తమ ప్రభుత్వం పనిచేస్తోందని, దానికి రైతు భరోసా పథకమే నిదర్శనమని మంత్రి శ్రీధర్ బాబు పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి ఉమ్మడి కరీంనగర్, వరంగల్ జిల్లాల నుంచి పెద్ద ఎత్తున రైతులు తరలివచ్చేలా చూడాలని కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. నియోజకవర్గాల వారీగా బాధ్యతలను కేటాయించిన ఆయన, ఎలాంటి లోటుపాట్లు లేకుండా ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులను, పార్టీ శ్రేణులను కోరారు. కాటారం సభ ద్వారా రైతులకు భరోసా కల్పించడమే కాకుండా, వ్యవసాయ రంగానికి ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యతను చాటి చెప్పబోతున్నామని ఆయన ఈ సందర్భంగా స్పష్టం చేశారు.

## సింహం బయటకు వస్తుంటే
## గుంటనక్కల గుండెల్లో దడ పుడుతోంది: కేటీఆర్

- **కేసీఆర్ సభకు వస్తున్నారని తెలిసి ప్రభుత్వం కుట్రలకు తెరలేపుతోందని విమర్శ**
- **కేసీఆర్ జగిత్యాల వస్తున్నారనగానే రేవంత్ రెడ్డి మేడిగడ్డ పర్యటనకు వెళుతున్నారని ఆగ్రహం**
- **కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్వుతున్నారని విమర్శ**

జగిత్యాల : సింహం బయటకు వస్తుందంటే గుంటనక్కల గుండెల్లో దడ పుడుతుందని, అందుకే కేసీఆర్ జగిత్యాలలో బహిరంగ సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఎన్నో కుట్రలకు తెరలేపుతోందని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ మండిపడ్డారు. జగిత్యాలలో మాజీ మంత్రి జీవన్ రెడ్డిని కేటీఆర్, హరీశ్ రావులు కలిశారు. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ సభ పెడతానంటే అడ్డుకునే ప్రయత్నాలు చేస్తున్నారని అన్నారు. రేవంత్ రెడ్డి చాలా సిల్లీ పాలిటిక్స్ చేస్తున్నారని ఎద్దేవా చేశారు. కేసీఆర్ జగిత్యాల సభకు వస్తున్నారంటే రేవంత్ రెడ్డి మేడిగడ్డకు వెళుతున్నారని అన్నారు. రెండున్నరేళ్లలో మేడిగడ్డ వెళ్లేందుకు ముఖ్యమంత్రికి సమయం లేదా అని ప్రశ్నించారు. ఇక్కడ కేసీఆర్ కీలక బహిరంగ సభ జరుగుతుంటే టీవీలల్లో కేసీఆర్‌తో పాటు తన మేడిగడ్డ పర్యటన కూడా చూపించాలని, అలాగే పత్రికల్లో పతాక శీర్షికన కేసీఆర్‌తో పాటు తన వార్త రావాలనే చిల్లర ప్రయత్నం రేవంత్ రెడ్డి చేస్తున్నారని ఆరోపించారు. అలాగే జగిత్యాల వచ్చే రోడ్డు మూడేళ్లలో గుర్తుకు రాలేదు కానీ, ఇప్పుడు కేసీఆర్ సభ అనేసరికి రోడ్డును తవ్విస్తున్నారని మండిపడ్డారు. కోరుట్ల నుంచి ఎవరూ రాకుండా



తవ్విస్తున్నారని ఆరోపించారు. గతంలో ఎన్నో బహిరంగ సభలు జరిగాయని, ఇప్పుడు కూడా విజయవంతమవుతుందని ధీమా వ్యక్తం చేశారు. రేవంత్ రెడ్డి హైట్ మాత్రమే చిన్నది కాదని మెదడు కూడా చిన్నదేనని ఎద్దేవా చేశారు. కాగా, ఎల్లుండి జగిత్యాలలో జరగనున్న బహిరంగ సభలో జీవన్ రెడ్డి బీఆర్ఎస్ పార్టీలో చేరనున్నారు.

## ఉద్యమం చేసి సాధించిన తెలంగాణను తేజస్వీ అవమానించారు: పొన్నం ప్రభాకర్

హైదరాబాద్: దశాబ్దాలుగా ఉద్యమం చేసి సాధించుకున్న తెలంగాణను బీజేపీ కర్ణాటక ఎంపీ తేజస్వీ సూర్య అవమానించారని తెలంగాణ రాష్ట్ర మంత్రి పొన్నం ప్రభాకర్ అన్నారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటును ఆయన అవమానిస్తుంటే తెలంగాణ బీజేపీ ఎంపీలు నోరు కూడా మెదపలేదని విమర్శించారు. తేజస్వీ సూర్య చేసిన వ్యాఖ్యలు పార్లమెంట్ రికార్డుల్లో ఉండకూడదని డిమాండ్ చేశారు. డీలిమిటేషన్ బిల్లుతో దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం చేసే ప్రయత్నాన్ని విపక్షాలు అడ్డుకున్నాయని మంత్రి అన్నారు. మహిళా రిజర్వేషన్ బిల్లును డీలిమిటేషన్‌తో కలపకుంటే కాంగ్రెస్ పార్టీ సహా ఇండియా కూటమి మద్దతిస్తుందని హామీ



ఇచ్చారు. కానీ కేంద్ర ప్రభుత్వం కుట్రపూరితంగా డీలిమిటేషన్‌తో కలిపి మహిళా రిజర్వేషన్ బిల్లును లోక్ సభలో ప్రవేశపెట్టిందని పొన్నం ప్రభాకర్ ధ్వజమెత్తారు.

## దక్షిణాదికి విపక్షాల చారిత్రక ద్రోహం..
## రక్షణ కవచం లాంటి బిల్లును చంపేశారు: బండి సంజయ్

- **దక్షిణాది ప్రయోజనాలను కాపాడే బిల్లును విపక్షాలు అడ్డుకున్నాయన్న బండి సంజయ్**
- **దక్షిణాది గౌరవం పేరుతో డ్రామాలు ఆడుతున్నారని విమర్శ**
- **రాజకీయ స్వార్థం కోసం చారిత్రక సంస్కరణను అడ్డుకున్నారని మండిపాటు**

న్యూఢిల్లీ/హైదరాబాద్, ఏప్రిల్ 18 : నియోజకవర్గాల పునర్విభజన నేపథ్యంలో దక్షిణాది రాష్ట్రాల ప్రయోజనాలను కాపాడేందుకు



కేంద్రం ప్రతిపాదించిన రాజ్యాంగ సవరణ బిల్లును విపక్షాలు అడ్డుకోవడాన్ని కేంద్ర మంత్రి బండి సంజయ్ తీవ్రంగా తప్పుబట్టారు. ఎక్స్ వేదికగా ఆయన స్పందిస్తూ... కాంగ్రెస్, ఇండియా కూటమిపై నిప్పులు చెరిగారు. బయట 'దక్షిణాది గౌరవం' అంటూ డ్రామాలు ఆడే విపక్షాలు, పార్లమెంటులో మాత్రం ఆ ప్రాంత గొంతు నొక్కేలా వ్యవహరించడం వారి ద్వంద్వ నీతికి నిదర్శనమని సంజయ్ మండిపడ్డారు. 2026 తర్వాత జరగబోయే పునర్విభజన వల్ల జనాభా నియంత్రణ పాటించిన తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ వంటి రాష్ట్రాలు రాజకీయ ప్రాధాన్యత కోల్పోయే ప్రమాదం ఉందని, దానిని అడ్డుకునేందుకే ప్రధాని మోదీ ఈ 'రక్షణ కవచం' లాంటి బిల్లును తెచ్చారని బండి సంజయ్ వివరించారు. కేంద్ర హోంమంత్రి అమిత్ షా దక్షిణాది సీట్లను 50 శాతం పెంచేందుకు సిద్ధమని స్పష్టమైన హామీ ఇచ్చినా విపక్షాలు స్పందించకపోవడం దారుణమన్నారు. కేవలం రాజకీయ స్వార్థం కోసమే ఈ చారిత్రక సంస్కరణను అడ్డుకుని, దక్షిణాది ప్రజలకు కాంగ్రెస్ తీరని అన్యాయం చేసిందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. భవిష్యత్తులో జరగబోయే సీట్ల కోతకు విపక్షాలే బాధ్యత వహించాలని, ఈ ద్రోహాన్ని ప్రజలు క్షమించరని ఆయన హెచ్చరించారు.

## దోమతెర కప్పుకుని డ్యూటీ.. హైదరాబాద్ సెక్యూరిటీ గార్డ్ వీడియో వైరల్!

- **హైదరాబాద్‌లో దోమతెర కప్పుకుని విధులు నిర్వర్తిస్తున్న సెక్యూరిటీ గార్డ్**
- **గార్డులకు కనీస సౌకర్యాలు కల్పించరా? అని నెటిజన్ల ప్రశ్న**
- **సెక్యూరిటీ గార్డుల దుస్థితిపై నెట్టింట పెద్ద ఎత్తున చర్చ**



హైదరాబాద్‌కు చెందిన ఓ సెక్యూరిటీ గార్డ్ వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో అందరి దృష్టిని ఆకర్షిస్తూ, తీవ్ర చర్చకు దారితీసింది. ఓ నివాస సముదాయంలో రాత్రి షిఫ్ట్‌లో పనిచేస్తున్న సెక్యూరిటీ గార్డ్ దోమల నుంచి రక్షించుకోవడానికి దోమతెర కప్పుకుని విధుల్లో ఉండటం ఈ వీడియోలో ఉంది. ఈ దృశ్యం సెక్యూరిటీ గార్డులు ఎదుర్కొంటున్న కష్టతరమైన పని పరిస్థితులను కళ్లకు కడుతోంది. సూరజ్ కుమార్ బౌధ్ అనే యూజర్ ఈ వీడియోను 'ఎక్స్' (ట్విట్టర్)లో పోస్ట్ చేశారు. రాత్రిపూట ఓ సెక్యూరిటీ గార్డ్ కుర్చీలో కూర్చుని దోమతెర కప్పుకుని ఉండటాన్ని ఆయన వీడియో తీశారు. అపార్ట్‌మెంట్‌లోని నివాసితులు ఏసీ గదుల్లో హాయిగా నిద్రిస్తుంటే, రాత్రంతా బయట విధులు నిర్వర్తించే ఈ గార్డులకు కనీసం సురక్షితమైన, సౌకర్యవంతమైన స్థలాన్ని ఎందుకు కల్పించలేరని ఆయన ప్రశ్నించారు. పేదల పట్ల ప్రజల్లో సానుభూతి, సున్నితత్వం తగ్గిపోవడమే అసలు సమస్య అని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వీడియో వైరల్ కావడంతో సెక్యూరిటీ గార్డుల దుస్థితిపై నెటిజన్ల నుంచి పెద్ద ఎత్తున స్పందన వస్తోంది. "ఇది డ్యూటీ కాదు, ఆధునిక బానిసత్వం" అని ఒకరు కామెంట్ చేయగా, "ఈ దృశ్యం నిజంగా హృదయాన్ని కలిచివేస్తోంది" అని మరొకరు పేర్కొన్నారు. "ఈ గార్డుల బాధ్యత సొసైటీ యాజమాన్యానిదే, కానీ వారు ఏమాత్రం పట్టించుకోవడం లేదు" అంటూ పలువురు తమ అభిప్రాయాలను పంచుకుంటున్నారు.

## సదాశివపేటలో ఉర్సు ఉత్సవాలు.. పాల్గొన్న టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి

సదాశివపేట, ఏప్రిల్ 18: సదాశివపేట పట్టణంలోని హజరత్ మహబూబ్ పాశ దర్గా వద్ద జరుగుతున్న ఉర్సు ఉత్సవాల్లో టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పాల్గొన్నారు. గత మూడు రోజులుగా ఈ ఉత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఈ సందర్భంగా దర్గా ప్రాంగణంలో హజరత్ సయ్యద్ షా మహమ్మద్ సాహెబ్ 422వ ఉర్సే షరీఫ్, హజరత్ మహబూబ్ పాశ 52వ ఉర్సే షరీఫ్ ఉత్సవాలు సంయుక్తంగా నిర్వహిస్తుండగా.. పెద్ద సంఖ్యలో జనం హాజరైన ప్రార్థనలు చేస్తున్నారు. ఉత్సవాల్లో భాగంగా నిర్వహించిన కవ్వాలి కార్యక్రమం ఆహూతులను విశేషంగా ఆకట్టుకుంది. ఆధ్యాత్మిక గీతాలతో సాగిన ఈ కార్యక్రమం భక్తి వాతావరణాన్ని మరింతగా పెంచింది. కార్యక్రమ నిర్వాహకులను, దర్గా కమిటీ సభ్యులను జగ్గారెడ్డి అభినందించారు. ఈ సందర్భంగా జగ్గారెడ్డి



మాట్లాడుతూ, ఉర్సు ఉత్సవాలు మత సామరస్యానికి ప్రతీకగా నిలుస్తున్నాయని అన్నారు. కవ్వాలి కార్యక్రమం అత్యంత ఆహ్లాదకరంగా సాగిందని పేర్కొంటూ నిర్వాహకులను ప్రశంసించారు.

## వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన: పొంగులేటి

హైదరాబాద్: వరంగల్, ఆదిలాబాద్, కొత్తగూడెంలో ఎయిర్‌పోర్టుల నిర్మాణంపై మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి సమీక్ష నిర్వహించారు. వరంగల్ ఎయిర్‌పోర్టుకు త్వరలో శంకుస్థాపన చేస్తామన్నారు. ఆదిలాబాద్ విమానాశ్రయానికి మాస్టర్‌ప్లాన్ సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. కొత్తగూడెంలో ప్రతిపాదిత భూమి అనువుగా లేదని విమానయాన శాఖ తెలిపింది. అధ్యయనం చేసి సాధ్యాసాధ్యాలపై నివేదిక ఇవ్వాలని మంత్రి ఆదేశించారు.

## దొరికినట్టే దొరికి తప్పించుకున్న నిదా ఖాన్..

**టీసీఎస్ నాసిక్ కేసులో కీలక పరిణామం**

**నిదా ఖాన్ భర్తను అదుపులోకి తీసుకుని విచారించిన పోలీసులు**

**ఆమె లొకేషన్ వివరాలు వెల్లడించిన భర్త**

**పోలీసులు వెళ్లేసరికే ఇంటికి తాళం వేసి పరారీ**



**న్యూఢిల్లీ:** టీసీఎస్ నాసిక్ వేధింపుల కేసులో ప్రధాన నిందితురాలైన నిదా ఖాన్ ఆచూకీ వ్యవహారం ఉత్కంఠ రేపుతోంది. ఆమె భర్త స్వయంగా ఆచూకీ చెప్పినప్పటికీ, పోలీసుల రాకను పసిగట్టిన నిదా ఖాన్ అక్కడి నుంచి పరారైంది. దీంతో ఈ కేసులో మరో కీలక మలుపు చోటుచేసుకుంది. విచారణలో భాగంగా పోలీసులు నిదా ఖాన్ భర్తను ప్రశ్నించగా, ఆయన పోలీసులకు సహకరించాడు. తన భార్య ప్రస్తుతం ఎక్కడ ఉంటోందో స్పష్టమైన సమాచారం అందించాడు. ఆ లొకేషన్ ఆధారంగా పోలీసులు వెంటనే అక్కడికి చేరుకున్నారు. అయితే, వారు వెళ్లేసరికే ఆ ఇంటికి తాళం వేసి ఉండటంతో అధికారులు అవాక్కయ్యారు. పోలీసులు వస్తారని ఊహించి నిదా ఖాన్ అక్కడి నుంచి తప్పించుకుంది.

టీసీఎస్‌లో హెచ్ ఆర్ విభాగంలో పనిచేసిన నిదా ఖాన్ పై తీవ్రమైన ఆరోపణలు ఉన్నాయి. టీమ్ లీడర్లు లైంగిక వేధింపులకు గురిచేస్తున్నారని మహిళా ఉద్యోగులు ఫిర్యాదు చేసినా పట్టించుకోలేదని, పైపెచ్చు నిందితులకు మద్దతుగా నిలిచిందని, మతం మారాలంటూ బాధితులపై ఒత్తిడి తెచ్చినట్లు పోలీసులు ఆరోపిస్తున్నారు. ఉద్యోగులను టార్గెట్ చేసి బలవంతంగా మతమార్పిడులకు పాల్పడేందుకు పథకం ప్రకారమే నిదా ఖాన్ వ్యవహరించిందని అనుమానిస్తున్నారు.

బాధితుల ఫిర్యాదుతో పోలీసులు మొత్తం 9 ఎఫ్ఐఆర్ లు నమోదు చేసి కేసు దర్యాప్తు చేపట్టారు. లైంగిక వేధింపులకు పాల్పడిన టీమ్ లీడర్లను అరెస్టు చేశారు. అయితే, ఈ కేసులో ప్రధాన సూత్రధారిగా భావిస్తున్న నిదా ఖాన్ మాత్రం పరారీలో ఉంది. దీంతో ఆమె కోసం పోలీసులు ముమ్మరంగా గాలింపు చర్యలు చేపట్టారు. ప్రస్తుతం నిదా ఖాన్ తన ఫోన్‌ను స్విచ్ ఆఫ్ చేయడంతో ఆమెను పట్టుకోవడం పోలీసులకు సవాలుగా మారింది. ఆమెకు ఎవరైనా ఆశ్రయం కల్పిస్తున్నారా? అనే కోణంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. నిందితురాలి కోసం ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి పొరుగు రాష్ట్రాల్లో సైతం గాలింపు చర్యలు చేపట్టారు.

## మెటాలో మళ్లీ ఉద్యోగాల కోత..

**మేలో 8,000 మంది ఇంటికి!**

**మే 20న తొలి విడత లేఆఫ్స్‌కు సిద్ధమైన సోషల్ మీడియా దిగ్గజం మెటా**

**మొదట 8,000 మంది ఉద్యోగులను తొలగించనున్నట్టు సమాచారం**

**2022-23 తర్వాత కంపెనీలో ఇదే అతిపెద్ద ఉద్యోగాల కోత**

**ఈ ఏడాది ద్వితీయార్ధంలో మరిన్ని తొలగింపులు ఉండే అవకాశం**




**న్యూఢిల్లీ:** సోషల్ మీడియా దిగ్గజం, ఫేస్‌బుక్ మాతృ సంస్థ మెటా మరోసారి భారీ ఉద్యోగాల కోతకు సిద్ధమవుతోంది. ఈ ఏడాది చేపట్టనున్న తొలగింపుల ప్రక్రియలో భాగంగా తొలి విడత లేఆఫ్స్‌ను మే 20న నిర్వహించనున్నట్టు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఈ మొదటి రౌండ్‌లో ప్రపంచవ్యాప్తంగా సుమారు 10% మంది, అంటే దాదాపు 8,000 మంది ఉద్యోగులను తొలగించనున్నారని తెలుస్తోంది. ఈ మేరకు మూడు అంతర్గత వర్గాలను ఉటంకిస్తూ రాయిటర్స్ ఒక కథనాన్ని ప్రచురించింది.

కంపెనీ సీఈఓ మార్క్ జూకర్‌బర్గ్ ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) టెక్నాలజీపై వందల బిలియన్ డాలర్లు పెట్టుబడిగా పెడుతున్నారు. ఏఐ ఆధారంగా కంపెనీ పనితీరును సమూలంగా మార్చాలన్న ఆయన వ్యూహంలో భాగంగానే ఈ లేఆఫ్స్ చోటుచేసుకుంటున్నాయి. ఏఐ సాయంతో తక్కువ మంది ఉద్యోగులతో ముఖ్యంగా మేనేజ్‌మెంట్ స్థాయిలను తగ్గించి, అధిక సామర్థ్యం సాధించాలని కంపెనీ భావిస్తోంది. అయితే, ఈ లేఆఫ్‌ల సమయం లేదా వాటి పరిధిపై స్పందించడానికి మెటా నిరాకరించింది.

2022-23 మధ్యకాలంలో "ఇయర్ ఆఫ్ ఎఫిషియెన్సీ" పేరుతో మెటా సుమారు 21,000 ఉద్యోగాలను తొలగించింది. అప్పట్లో కంపెనీ ఆర్థిక ఇబ్బందులు, షేర్ల పతనం వంటి కారణాలతో ఆ నిర్ణయం తీసుకుంది. కానీ, ప్రస్తుత పరిస్థితి భిన్నం. గతేడాది మెటా 200 బిలియన్ డాలర్ల ఆదాయం, 60 బిలియన్ డాలర్ల లాభం గడించి ఆర్థికంగా పటిష్ఠంగా ఉంది. అయినా సరే, భవిష్యత్ వ్యూహాల్లో భాగంగా ఉద్యోగులను తగ్గించుకోవాలని నిర్ణయించడం గమనార్హం.

## రూపాయి విలువ పతనం దెబ్బ..

**దిగజారిన భారత ఆర్థిక ర్యాంకు**

**ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థ స్థానాన్ని కోల్పోయిన భారత్**

**రెండు స్థానాలు దిగజారి ఆరవ ర్యాంకుకు పరిమితం**

**భారత్‌ను అధిగమించిన జపాన్, బ్రిటన్**

**రూపాయి పతనం, జీడీపీ అంచనాల సవరణే ప్రధాన కారణాలు**

**వచ్చే ఏడాది భారత్ తిరిగి పుంజుకుంటుందని నిపుణుల అంచనా**



**న్యూఢిల్లీ:** ప్రపంచంలో నాలుగో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఉన్న భారత్, తాజాగా రెండు స్థానాలు దిగజారి ఆరవ ర్యాంకుకు పడిపోయింది. అంతర్జాతీయ ద్రవ్యనిధి (ఐఎంఎఫ్) విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం జపాన్, బ్రిటన్‌లు భారత్‌ను అధిగమించి వరుసగా నాలుగు, ఐదు స్థానాల్లో నిలిచాయి. భారత జీడీపీ వృద్ధిలో వెనుకబడటం దీనికి కారణం కాదు. అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా పెరిగిన చమురు ధరలు, డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ భారీగా పతనం కావడమే ఈ మార్పుకు ప్రధాన కారణంగా విశ్లేషకులు చెబుతున్నారు.

అమెరికా-ఇరాన్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో అంతర్జాతీయంగా ముడి చమురు ధరలు పెరిగాయి. దిగుమతులపైనే అధికంగా ఆధారపడే భారత్, చమురు కొనుగోలుకు భారీగా డాలర్లను వెచ్చించాల్సి వస్తోంది. దీంతో డాలర్‌కు డిమాండ్ పెరిగి, రూపాయి మారకం విలువ క్షీణించింది. ఫలితంగా డాలర్ల లెక్కల్లో భారత జీడీపీ పరిమాణం తగ్గిపోయి ర్యాంకుపై ప్రభావం చూపింది. ప్రభుత్వ వర్గాలు జీడీపీ అంచనాలను సవరించడం కూడా దీనికి మరో కారణంగా నిలిచింది.

# చివరి ఓవర్ థ్రిల్లర్..

**చెన్నైపై సన్‌రైజర్స్ ఉత్కంఠ విజయం!**

**చెన్నైపై సన్‌రైజర్స్ విజయం**

**అర్ధ శతకాలతో చెలరేగిన అభిషేక్ శర్మ, హెన్రిచ్ క్లాసెన్**


**చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్, ఓవర్టన్ మూడేసి వికెట్లు**

**మూడు వికెట్లతో చెన్నైని దెబ్బతీసిన ఎషాన్ మలింగ**

**10 పరుగుల తేడాతో సన్ రైజర్స్ విక్టరీ**

**ఆఖరి ఓవర్ లో అద్భుతంగా బౌలింగ్ చేసిన ప్రఫుల్ హింగే**

**హైదరాబాద్:** హైదరాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ స్టేడియం ఉత్కంఠతో ఊగిపోయింది. చెన్నై సూపర్ కింగ్స్ పై సన్ రైజర్స్ హైదరాబాద్ అద్భుత విజయం నమోదు చేసింది. దాదాపు ఓటమి ఖాయం అనుకున్న స్థితి నుంచి సన్ రైజర్స్ గట్టెక్కిన తీరు అదరహో అనాల్సిందే. 195 పరుగుల లక్ష్యఛేదనలో చెన్నై జట్టు నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్లకు 184 పరుగులు మాత్రమే చేసి ఓటమిపాలైంది.





చివరి ఓవర్లో చెన్నై సూపర్ కింగ్స్ విజయానికి 18 పరుగులు అవసరం కాగా, సన్‌రైజర్స్ హైదరాబాద్ కెప్టెన్ ఇషాన్ కిషన్ బంతిని ప్రఫుల్ హింగేకు అప్పగించాడు. అప్పటికే మూడు ఓవర్లలో 54 పరుగులు సమర్పించుకుని అత్యంత ఖరీదైన బౌలర్‌గా నిలిచిన హింగేపై ఒత్తిడి స్పష్టంగా కనిపించింది. తొలి బంతికి రెండు పరుగులు, రెండో బంతికి లెగ్ బై రూపంలో ఒక పరుగు వచ్చాయి. మూడో బంతిని హింగే నడుము కంటే ఎత్తులో వేయడంతో అంపైర్ నో-బాల్‌గా ప్రకటించాడు. దీంతో సమీకరణం 4 బంతుల్లో 14 పరుగులుగా మారింది.

అయితే, ఫ్రీ-హిట్‌ను అన్షుల్ కంబోజ్ సద్వినియోగం చేసుకోలేకపోయాడు. ఆ తర్వాత బంతికి భారీ షాట్‌కు ప్రయత్నించిన జామీ ఓవర్టన్ (16) లాంగ్-ఆఫ్‌లో లివింగ్‌స్టోన్‌కు క్యాచ్ ఇచ్చి వెనుదిరగడంతో సన్‌రైజర్స్ శిబిరంలో ఆనందం వెల్లివిరిసింది. చివరి రెండు బంతులకు రెండు సింగిల్స్ మాత్రమే రావడంతో సన్‌రైజర్స్ హైదరాబాద్ 10 పరుగుల తేడాతో అద్భుత విజయాన్ని అందుకుంది.

అంతకుముందు, టాస్ ఓడి మొదట బ్యాటింగ్ చేసిన సన్‌రైజర్స్ హైదరాబాద్ నిర్ణీత 20 ఓవర్లలో 9 వికెట్ల నష్టానికి 194 పరుగుల భారీ స్కోరు సాధించింది. యువ సంచలనం అభిషేక్ శర్మ (22 బంతుల్లో 59; 6 ఫోర్లు, 4 సిక్సర్లు) ఆకాశమే హద్దుగా చెలరేగాడు. ట్రావిస్ హెడ్‌తో (23) కలిసి తొలి వికెట్‌కు కేవలం 5.5 ఓవర్లలో 75 పరుగులు జోడించి బలమైన పునాది వేశాడు. అయితే, ముఖేష్ చౌదరి ఒకే ఓవర్లో హెడ్, ఇషాన్ కిషన్‌లను పెవిలియన్ పంపి చెన్నైకి ఊరటనిచ్చాడు. ఈ దశలో క్రీజులోకి వచ్చిన హెన్రిచ్ క్లాసెన్ (39 బంతుల్లో 59; 6 ఫోర్లు, 2 సిక్సర్లు) మరో అద్భుత ఇన్నింగ్స్‌తో జట్టును ఆదుకున్నాడు. ఓవైపు వికెట్లు పడుతున్నా, క్లాసెన్ తన క్లాస్ ఆటతో స్కోరు బోర్డును ముందుకు నడిపించాడు. చెన్నై బౌలర్లలో అన్షుల్ కంబోజ్, జామీ ఓవర్టన్ చెరో మూడు వికెట్లు తీయగా, ముఖేష్ చౌదరి రెండు వికెట్లు పడగొట్టాడు.

195 పరుగుల భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన చెన్నై సూపర్ కింగ్స్ కూడా ధీటుగానే బదులిచ్చింది. ఆయుష్ మాత్రే (13 బంతుల్లో 30) మెరుపులు మెరిపించాడు. మాథ్యూ షార్ట్ (34), సర్ఫరాజ్ ఖాన్ (25), శివమ్ దూబే (21) తమ వంతు పోరాటం చేశారు. అయితే, సన్‌రైజర్స్ బౌలర్లు కీలక సమయాల్లో వికెట్లు తీస్తూ మ్యాచ్‌ను తమవైపు తిప్పుకున్నారు. ముఖ్యంగా, ఎషాన్ మలింగ (3/29) తన అద్భుత బౌలింగ్‌తో చెన్నై మిడిల్ ఆర్డర్‌ను దెబ్బతీశాడు. నితీష్ కుమార్ రెడ్డి రెండు వికెట్లతో ఆల్ రౌండ్ ప్రదర్శన కనబరిచాడు. చివరి వరకు పోరాడినప్పటికీ, లక్ష్యానికి 10 పరుగుల దూరంలో నిలిచి చెన్నై ఓటమిని అంగీకరించింది. ఈ గెలుపుతో సన్‌రైజర్స్ పాయింట్ల పట్టికలో మరింత ముందుకు దూసుకెళ్లింది.



## టీ20ల్లో కొత్త చరిత్ర..

**రోహిత్ శర్మను అధిగమించిన స్మృతి మంధాన**


**టీ20ల్లో భారత్ తరఫున టాప్ రన్ స్కోరర్‌గా స్మృతి మంధాన**

**రోహిత్ శర్మ (4,231) రికార్డును అధిగమించిన భారత మహిళా బ్యాటర్**

**దక్షిణాఫ్రికాతో జరిగిన తొలి టీ20లో ఈ ఘనత**

**ప్రస్తుతం 161 మ్యాచ్‌ల్లో 4,244 పరుగులతో మంధాన అగ్రస్థానం**

**టీ20ల నుంచి రోహిత్ రిటైర్ అవ్వడంతో ఈ రికార్డు పదిలం**




**న్యూఢిల్లీ:** భారత స్టార్ మహిళా క్రికెటర్ స్మృతి మంధాన చరిత్ర సృష్టించింది. టీ20 అంతర్జాతీయ ఫార్మాట్‌లో భారత్ తరఫున అత్యధిక పరుగులు చేసిన క్రీడాకారిణిగా సరికొత్త రికార్డును తన పేరిట లిఖించుకుంది. ఈ క్రమంలో భారత పురుషుల జట్టు మాజీ కెప్టెన్ రోహిత్ శర్మను ఆమె అధిగమించింది. దక్షిణాఫ్రికాతో శుక్రవారం దర్బన్‌లో జరిగిన తొలి టీ20 మ్యాచ్‌లో మంధాన ఈ అరుదైన మైలురాయిని అందుకుంది.

ఈ మ్యాచ్ ప్రారంభానికి ముందు స్మృతి మంధాన, రోహిత్ శర్మ ఇద్దరూ 4,231 పరుగులతో సమంగా ఉన్నారు. దక్షిణాఫ్రికా బౌలర్ సునే లూస్ వేసిన బంతికి సింగిల్ తీయడం ద్వారా మంధాన, రోహిత్ రికార్డును బద్దలు కొట్టింది. ఈ మ్యాచ్‌లో ఒక సిక్సర్‌తో కలిపి 13 పరుగులు చేసిన ఆమె, ఆ తర్వాత అయాబొంగా ఖాకా బౌలింగ్‌లో ఔటైంది. తాజా రికార్డుతో స్మృతి మంధాన 161 టీ20 మ్యాచ్‌ల్లో 30.53 సగటుతో 4,244 పరుగులు పూర్తి చేసింది. ఆమె కెరీర్‌లో ఒక సెంచరీ, 33 హాఫ్ సెంచరీలు ఉన్నాయి. మరోవైపు రోహిత్ శర్మ 159 మ్యాచ్‌ల్లో 5 సెంచరీలు, 32 అర్ధశతకాలతో 4,231 పరుగులు చేశాడు.

2024 టీ20 ప్రపంచకప్ తర్వాత రోహిత్ శర్మ పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించిన విషయం తెలిసిందే. దీంతో మంధాన రికార్డును తిరిగి అధిగమించే అవకాశం అతనికి లేదు. ఫలితంగా భారత టీ20 క్రికెట్‌లో పరుగుల రాణిగా స్మృతి మంధాన స్థానం పదిలంగా నిలవనుంది.

### శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్ విన్యాసంపై

## జాంటీరోడ్స్ ఆసక్తికర వ్యాఖ్యలు

**శ్రేయస్ అయ్యర్ ఫీల్డింగ్‌పై జాంటీ రోడ్స్ ప్రశంసలు**

**ఫీల్డింగ్‌కు తండ్రిని కాదు, ముసలి తాతను అయ్యానని రోడ్స్ ఆసక్తికర వ్యాఖ్య**

**ఆధునిక ఫీల్డింగ్ ప్రమాణాలు అద్భుతమని దక్షిణాఫ్రికా దిగ్గజం కితాబు**

**హార్దిక్ పాండ్యా ఔట్‌కు కారణమైన అయ్యర్ బౌండరీ క్యాచ్‌పై స్పందన**

**కోచ్ రికీ పాంటింగ్ కూడా గొప్ప ఫీల్డర్ కావడం వల్లే ఇది సాధ్యమైందని వ్యాఖ్య**



**న్యూఢిల్లీ:** ముంబై ఇండియన్స్‌తో మ్యాచ్ లో పంజాబ్ కింగ్స్ కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ పట్టిన ఓ అద్భుతమైన క్యాచ్‌పై దక్షిణాఫ్రికా ఫీల్డింగ్ దిగ్గజం జాంటీ రోడ్స్ ప్రశంసల వర్షం కురిపించాడు. శ్రేయస్ ఫీల్డింగ్ విన్యాసం చూశాక, తాను ఫీల్డింగ్‌కు తండ్రిని కాదని, తాతను అయిపోయాననిపిస్తోందని వ్యాఖ్యానించాడు. హార్దిక్ పాండ్యాను ఔట్ చేసే క్రమంలో అయ్యర్ అద్భుతమైన బౌండరీ సేవ్-కమ్-క్యాచ్‌ను అందుకోగా, ఆ ఫీట్‌కు సచిన్ టెండూల్కర్‌తో పాటు ముంబై డగౌట్‌లోని రోహిత్ శర్మ, సూర్యకుమార్ యాదవ్ సైతం అవాక్కయ్యారు.

ఈ ఘటనపై దక్షిణాఫ్రికా గ్రేట్ జాంటీ రోడ్స్ ఎక్స్ వేదికగా స్పందించాడు. "నా రిటైర్మెంట్ తర్వాత ఫీల్డింగ్ ఎంతగా అభివృద్ధి చెందిందో అయ్యర్ 'టీమ్ క్యాచ్' చూశాక అర్థమైంది. చాలాకాలం నన్ను నేను ఫీల్డింగ్ కు అబ్బ లాంటి వాడ్ని అనుకున్నా. కానీ, ఆధునిక అథ్లెట్ల టైమింగ్, బౌండరీ లైన్‌పై వారి అవగాహన చూస్తుంటే ఇప్పుడు నేను ' ఫీల్డింగ్ లో ఓ ముసలి తాత'గా మారిపోయినట్లు అనిపిస్తోంది" అని రోడ్స్ పేర్కొన్నాడు. తన కెరీర్‌లో 99 శాతం సమయం ఇన్నర్ సర్కిల్‌లోనే ఫీల్డింగ్ చేశానని, అప్పట్లో బౌండరీ ఫీల్డింగ్‌పై పెద్దగా దృష్టి ఉండేది కాదని రోడ్స్ గుర్తుచేసుకున్నాడు. "ముంబై ఇండియన్స్‌కు కోచ్‌గా పనిచేస్తున్నప్పుడు కీరన్ పొలార్డ్, గ్లెన్ మ్యాక్స్‌వెల్ వంటి వారు బౌండరీ వద్ద అద్భుతమైన ఫీట్స్ చేయడం చూశాకే, సిక్సర్లు ఆపడంపై ప్రత్యేకంగా దృష్టి సారించాం" అని వివరించాడు.

# స్టబ్స్, రాహుల్ అదుర్స్...

**ఆర్సీబీపై ఢిల్లీ ఘన విజయం**

**బెంగళూరుపై 6 వికెట్ల తేడాతో గెలిచిన ఢిల్లీ క్యాపిటల్స్**

**రాహుల్, స్టబ్స్ హాఫ్ సెంచరీలతో ఛేదనలో రాణించిన ఢిల్లీ**

**భువనేశ్వర్ కుమార్ మూడు వికెట్లు తీసినా తప్పని ఓటమి**

**ఆరంభంలో తడబడినా.. కీలక భాగస్వామ్యాలతో గట్టెక్కిన క్యాపిటల్స్**

**ఫిలిప్ సాల్ట్ అర్ధశతకంతో ఆర్సీబీ స్కోరు 175/8**



**బెంగళూరు:** ఐపీఎల్ 2026 సీజన్‌లో రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరుకు మరో ఓటమి ఎదురైంది. శనివారం బెంగళూరు చిన్నస్వామి స్టేడియం వేదికగా జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ క్యాపిటల్స్ 6 వికెట్ల తేడాతో ఆర్సీబీపై విజయం సాధించింది. ట్రిస్టన్ స్టబ్స్ (60లి), కేఎల్ రాహుల్ (57) అద్భుత హాఫ్ సెంచరీలతో ఢిల్లీని గెలిపించారు. 176 పరుగుల లక్ష్యాన్ని ఢిల్లీ 19.5 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి ఛేదించింది.

లక్ష్య ఛేదనలో ఢిల్లీకి ఆరంభంలోనే గట్టి ఎదురుదెబ్బ తగిలింది. భువనేశ్వర్ కుమార్ ధాటికి 18 పరుగులకే 3 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. ఈ దశలో క్రీజులోకి వచ్చిన ట్రిస్టన్ స్టబ్స్, కేఎల్ రాహుల్‌తో కలిసి ఇన్నింగ్స్‌ను చక్కదిద్దాడు. రాహుల్ దూకుడుగా ఆడి 34 బంతుల్లోనే 57 పరుగులు చేసి ఔటయ్యాడు. వీరిద్దరూ నాలుగో వికెట్‌కు 69 పరుగులు జోడించి జట్టును పోటీలో నిలిపారు. రాహుల్ ఔటయ్యాక, కెప్టెన్ అక్షర్ పటేల్ (26) రిటైర్డ్ హర్ట్‌గా వెనుదిరిగాడు. అయితే, చివరి వరకు క్రీజులో నిలిచిన స్టబ్స్ (47 బంతుల్లో 60 నాటౌట్) బాధ్యతాయుతమైన ఇన్నింగ్స్ ఆడాడు. చివర్లో డేవిడ్ మిల్లర్ (10 బంతుల్లో 22 నాటౌట్) మెరుపులు మెరిపించడంతో ఢిల్లీ మరో బంతి మిగిలి ఉండగానే విజయాన్ని అందుకుంది.

అంతకుముందు, టాస్ ఓడి బ్యాటింగ్‌కు దిగిన ఆర్సీబీ నిర్ణీత 20 ఓవర్లలో 8 వికెట్ల నష్టానికి 175 పరుగులు చేసింది. ఓపెనర్ ఫిలిప్ సాల్ట్ (38 బంతుల్లో 63) అద్భుత హాఫ్ సెంచరీతో రాణించాడు. విరాట్ కోహ్లీ (19), దేవదత్ పడిక్కల్ (18) మంచి ఆరంభాలను భారీ స్కోర్లుగా మలచలేకపోయారు. మిడిల్ ఆర్డర్ విఫలం కావడంతో ఆర్సీబీ ఓ మోస్తరు స్కోరుకే పరిమితమైంది. ఢిల్లీ బౌలర్లలో కెప్టెన్ అక్షర్ పటేల్, కుల్దీప్ యాదవ్ చెరో రెండు వికెట్లు పడగొట్టి ఆర్సీబీని కట్టడి చేశారు. ఆర్సీబీ బౌలర్లలో భువనేశ్వర్ కుమార్ 4 ఓవర్లలో 26 పరుగులిచ్చి 3 వికెట్లు తీసినప్పటికీ, మిగతా బౌలర్ల నుంచి సహకారం లభించకపోవడంతో జట్టుకు ఓటమి తప్పలేదు.


MOVIE TIME

## శౌర్యువ్ దర్శకత్వంలో....
# విజయ్ కొత్త ప్రాజెక్ట్




**టాకీస్:** ఇప్పటికే రెండు క్రేజీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్న విజయ్ దేవరకొండ.. శౌర్యువ్ దర్శకత్వంలో నటించే అవకాశాలున్నాయంటూ ఇటీవల ప్రచారం జరిగింది. దానిపై శనివారం అధికారిక ప్రకటన వెలువడింది. శౌర్యువ్‌తో సినిమాని ప్రకటిస్తూ.. విజయ్ షేర్ చేసిన పోస్టర్ ఆసక్తి రేకెత్తించేలా ఉంది. ఈ పోస్టర్‌తో మూవీ టీమ్‌ని పరిచయం చేశారు. జంతువులు, ఆయుధాలను హైలైట్ చేయడంతో ఇది వైలెంట్ మూవీ అని అర్థమవుతోంది. 'ఈ కోపమంతా ఒకప్పుడు ప్రేమే' అనే క్యాప్షన్ బట్టి.. ప్రేమలో విఫలమైన ఓ యువకుడి కథగా ఈ చిత్రం తెరకెక్కుతున్నట్టు తెలుస్తోంది. 'హాయ్ నాన్న'తో తొలి ప్రయత్నంలోనే మెప్పించిన దర్శకుడు శౌర్యువ్. తండ్రీకూతుళ్ల అనుబంధం నేపథ్యంతో విజయం అందుకున్న ఆయన.. ఇప్పుడు యాక్షన్‌కు ప్రాధాన్యం ఇచ్చినట్లు పోస్టర్‌ని చూస్తే తెలుస్తోంది. వర్కింగ్ టైటిల్‌తో త్వరలో ప్రారంభం కానున్న ఈ సినిమాకి హేషబ్ అబ్దుల్ సంగీత దర్శకుడు. హాలీవుడ్ సినిమాటోగ్రాఫర్ అలెజండ్రో మార్టినెజ్ ఈ చిత్రానికి వర్క్ చేయనుండటం విశేషం. హీరోయిన్ వివరాలు ఇంకా ప్రకటించలేదు. రాహుల్ సాంకృత్యాన్ డైరెక్షన్‌లో 'రణబాలి'లో నటిస్తున్నారు విజయ్. ఇదొక పీరియాడికల్ యాక్షన్ మూవీ. రష్మిక హీరోయిన్. ఈ చిత్రం సెప్టెంబరు 11న విడుదల కానుంది. మరోవైపు, రవికిరణ్ కోలా దర్శకత్వంలో 'రౌడీ జనార్దన'లో విజయ్ నటిస్తున్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ యాక్షన్ డ్రామాలో కీర్తి సురేశ్ హీరోయిన్.

## వారణాసి కోసం పాట చిత్రీకరణ



**టాకీస్:** కథానాయకుడు మహేశ్‌బాబు.. దర్శకుడు ఎస్ఎస్ రాజమౌళి కలయికలో రూపొందుతున్న బహుభాషా చిత్రం 'వారణాసి'. ఈ సినిమా గత కొన్నిరోజులుగా హైదరాబాద్‌లో చిత్రీకరణ చేసుకుంటున్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఇక్కడే ప్రత్యేకంగా సిద్ధం చేసిన ఓ భారీ సెట్‌లో పాట చిత్రీకరణ చేస్తున్నట్లు సమాచారం. దీనికి ప్రముఖ కొరియోగ్రాఫర్ బాస్కో మార్టిన్ నృత్యరీతులు అందిస్తున్నట్లు తెలిసింది. ఈ పాట చిత్రీకరణ పూర్తయ్యాక చిత్ర బృందం మే నెలంతా విరామం తీసుకోనుందని.. జూన్‌లో షూట్ తిరిగి ప్రారంభించనున్నారని తెలుస్తోంది. వివిధ యుగాలతో ముడిపడి సాగే ఆసక్తికర కథతో ఈ సినిమా ముస్తాబవుతుండగా.. మహేశ్ దీంట్లో శ్రీరాముడిగా, రుద్రగా రెండు పాత్రల్లో అలరించనున్నారు. ఈ చిత్రం వచ్చే ఏడాది ఏప్రిల్ 7న ప్రపంచవ్యాప్తంగా థియేటర్లలోకి రానుంది. కేఎల్ నారాయణ, ఎస్ఎస్ కార్తికేయ నిర్మిస్తున్నారు. ప్రియాంక చోప్రా, పృథ్వీరాజ్ సుకుమారన్ తదితరులు ముఖ్య పాత్రలు పోషిస్తున్నారు. ఈ సినిమాకి సంగీతం: ఎంఎం కీరవాణి, కథ: కె విజయేంద్ర ప్రసాద్, ఎస్ఎస్ కంచి, మాటలు: దేవ కట్టా, ఛాయాగ్రహణం: పీఎస్ వినోద్.

# సల్మాన్‌తో వంశీ పైడిపల్లి మూవీ



**టాకీస్:** బాలీవుడ్ సూపర్ స్టార్ సల్మాన్ ఖాన్ మరియు టాలీవుడ్ సక్సెస్‌ఫుల్ డైరెక్టర్ వంశీ పైడిపల్లి కాంబినేషన్‌లో తెరకెక్కనున్న భారీ యాక్షన్ ఎంటర్‌టైనర్ శనివారం పట్టాలెక్కింది. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్ బ్యానర్‌పై అగ్ర నిర్మాత దిల్‌రాజు నిర్మిస్తున్న ఈ ప్రతిష్టాత్మక చిత్రం రెగ్యులర్ షూటింగ్ నేటి నుంచి ప్రారంభమైనట్లు చిత్ర యూనిట్ అధికారికంగా ప్రకటించింది. ఈ ప్రాజెక్టులో 'లేడీ సూపర్ స్టార్' నయనతార కథానాయికగా నటిస్తుండటంతో అంచనాలు అప్పుడే ఆకాశాన్ని తాకాయి. బాలీవుడ్ కండల వీరుడు సల్మాన్ ఖాన్, వంశీ పైడిపల్లి డైరెక్షన్‌లో నటించడం ఇదే మొదటిసారి కావడంతో ఈ పాన్-ఇండియా చిత్రంపై దేశవ్యాప్తంగా ఆసక్తి నెలకొంది. ఈ నెలనుంచే షూటింగ్ మొదలవుతుందని గతంలోనే ప్రకటించిన చిత్ర బృందం, ఈరోజు నుంచి కెమెరా ముందుకు వెళ్తున్నట్లు వెల్లడించింది. యాక్షన్ మరియు ఎమోషన్స్ కలయికగా రానున్న ఈ చిత్రం 2027 ప్రథమార్థంలో ప్రేక్షకుల ముందుకు వచ్చే అవకాశం ఉంది.



# ఆ బాధ కోల్పోయిన వారికే తెలుస్తుంది..

ఆసక్తికర కామెంట్స్ చేసిన రెజీనా..

టాకీస్: తెలుగు సినీ ప్రపంచంలో తనకంటూ ప్రత్యేక గుర్తింపు సంపాదించుకుంది హీరోయిన్ రెజీనా కసాండ్రా. తెలుగు, తమిళంలో వరుస సినిమాలతో అలరిస్తుంది. కానీ రెండు దశాబ్దాలుగా ఇండస్ట్రీలో యాక్టివ్ గా ఉన్నప్పటికీ ఈ బ్యూటీకి సరైన బ్రేక్ మాత్రం రాలేదు. ప్రస్తుతం చేతినిండా ప్రాజెక్టులతో బిజీగా ఉన్న ఈ అమ్మడు.. తాజాగా బ్రేకప్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. టాలీవుడ్, కోలీవుడ్ చిత్ర పరిశ్రమలలో తనదైన నటనతో గుర్తింపు తెచ్చుకున్న నటి రెజీనా కాసాండ్రా. దాదాపు 20 సంవత్సరాలుగా సినీరంగంలో వరుస సినిమాలతో అలరిస్తుంది. కానీ ఇప్పటివరకు సరైన బ్రేక్ మాత్రం అందుకోలేకపోయింది. కెరీర్ ఆరంభం నుండి వైవిధ్యమైన పాత్రలు ఎంచుకుంటూ దూసుకుపోతున్న ఈ భామ, వ్యక్తిగత విషయాల గురించి చాలా అరుదుగా స్పందిస్తుంటుంది. తాజాగా ఆమె తన సోషల్ మీడియా వేదికగా ప్రేమ, గతం గురించి చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు నెట్టింట హాట్ టాపిక్‌గా మారాయి. రెజీనా తన ఇన్‌స్టాగ్రామ్ పోస్ట్‌లో ప్రేమ గురించి లోతైన భావాలను పంచుకున్నారు. "ప్రేమ అనేది బలహీనత కాదు, అదొక ప్రశాంతమైన బలం. ప్రతిరోజూ మన కోసం మనం చిరునవ్వుతో లేచి నిలబడాలి. ప్రతి ఒక్కరూ ప్రేమను పొందడానికి, పంచడానికి అర్హులనే విషయాన్ని ఎప్పుడూ మర్చిపోకూడదు" అని పేర్కొన్నారు. ముఖ్యంగా, "ప్రేమించడంలోనూ, ప్రేమించబడడంలోనూ ఉండే అసలైన సంతోషం మనకు ఎందుకు తెలుస్తుందంటే.. ఆ ప్రేమను కోల్పోయినప్పుడు కలిగే బాధ ఎలా ఉంటుందో మనకు ముందే తెలుసు కాబట్టి" అని ఆమె రాసుకొచ్చారు. 35 ఏళ్ల రెజీనా ఇప్పటికీ సింగిల్ గానే ఉన్నారు. గతంలో ఈమె ఒక ప్రముఖ నటుడితో ప్రేమాయణం సాగించిందని, ఆ తర్వాత విడిపోయిందని అప్పట్లో ఫిల్మ్ నగర్లో వార్తలు వినిపించాయి. ఇప్పుడు ఆమె అకస్మాత్తుగా "ప్రేమను కోల్పోవడంలో ఉండే బాధ" గురించి ప్రస్తావించడంతో, ఇది ఆమె సొంత జీవితంలోని అనుభవమేనా? అని నెటిజన్లు ఆసక్తిగా చర్చించుకుంటున్నారు. వ్యక్తిగత జీవితం ఎలా ఉన్నా, వృత్తిపరంగా రెజీనా ఫుల్ బిజీగా ఉన్నారు. ప్రస్తుతం ఆమె తెలుగులో 'ఫ్లాష్‌బ్యాక్', 'మూక్కుత్తి అమ్మన్-2' తో పాటు తమిళంలో 'ది వైవ్స్', హిందీలో 'సెక్షన్ 108' వంటి కీలక ప్రాజెక్టులలో నటిస్తున్నారు. కేవలం హీరోయిన్ గానే కాకుండా, నెగటివ్ షేడ్స్ ఉన్న పాత్రల్లోనూ నటిస్తూ తన సత్తా చాటుతున్న రెజీనా, ఈ లేటెస్ట్ పోస్ట్‌తో తన మనసులోని మాటను ధైర్యంగా బయటపెట్టారు.

## బాలయ్యతో
# కొరటాల శివ మూవీ




**టాకీస్:** ప్రస్తుతం కొరటాల శివ ఫోకస్ అంతా 'దేవర' సీక్వెల్ పైనే ఉందని అందరూ అనుకున్నారు. కానీ ఎన్టీఆర్ బిజీగా ఉండడంతో కుదరడం లేదు. ఎన్టీఆర్ ప్రస్తుతం ప్రశాంత్ నీల్ సినిమాతో బిజీగా ఉన్నారు. ఆ ప్రాజెక్ట్ పూర్తయి 'దేవర-2' మొదలవ్వడానికి కనీసం ఏడాది నుంచి ఏడాదిన్నర సమయం పట్టేలా ఉంది. ఈ ఖాళీ సమయాన్ని వృథా చేయకుండా, కొరటాల ఒక పవర్ ఫుల్ స్క్రిప్ట్‌ను సిద్ధం చేశారట. ఇప్పటికే ఈ కథను బాలయ్యకు వినిపించడం, దానికి ఆయన గ్రీన్ సిగ్నల్ ఇవ్వడం కూడా జరిగిపోయాయని సమాచారం. అయితే నందమూరి అభిమానుల్లో మెదులుతున్న ప్రశ్న ఏంటంటే.. దేవర 2 కంటే ముందే ఈ సినిమా ఉంటుందా అంటే అవుననే అంటున్నాయి టాలీవుడ్ వర్గాలు. ఎన్టీఆర్ డేట్స్ దొరికే వరకు వేచి చూడకుండా, బాలయ్యతో ఒక సెన్సేషనల్ ప్రాజెక్ట్ పూర్తి చేయాలని కొరటాల భావిస్తున్నారు. ఇది టాలీవుడ్ వరకు పరిమితమవుతుందా లేక పాన్ ఇండియా రేంజ్‌లో ఉంటుందా అనే క్లారిటీ రావాల్సి ఉంది. అయితే బాలయ్య క్రేజ్ ఇప్పుడు నేషనల్ లెవల్‌లో ఉంది కాబట్టి, ఇది భారీ లెవల్‌లోనే ఉండే అవకాశం ఉంది.

బాలయ్య లైనప్ చూస్తుంటే ఫ్యాన్స్‌కు పూనకాలు రావడం ఖాయం. ఇప్పటికే గోపీచంద్ మలినేనితో ఒక

సినిమా పట్టాలెక్కనుంది. అలాగే వివేక్ ఆత్రేయ, క్రిష్ వంటి దర్శకులతో సినిమాలు చర్చల దశలో ఉన్నాయి. ఈ గ్యాప్‌లో కొరటాల శివ సినిమా ఎప్పుడు సెట్స్ పైకి వెళ్తుంది..? ఒకవేళ ఈ సినిమా గనుక మొదలైతే, కొరటాల శివ దర్శకత్వంలో చేయబోయే దేవర-2 మరింత ఆలస్యం అయ్యే అవకాశం ఉందా అనేది తెలియాల్సి ఉంది. బాలయ్య మార్క్ యాక్షన్.. కొరటాల మార్క్ సోషల్ మెసేజ్ కలిసి బాక్సాఫీస్ దగ్గర ఎలాంటి సంచలనాలు సృష్టిస్తాయో చూడాలి. మరి ఎన్టీఆర్ కంటే ముందే కొరటాల బాలయ్య సినిమాను పూర్తి చేస్తారా..? ఈ సినిమా పై అధికారిక ప్రకటన ఎప్పుడు వస్తుంది..? అనే విషయాలు తెలియాలంటే మరికొద్ది రోజులు ఆగాల్సిందే. మన బాలయ్య ఊపు చూస్తుంటే ఏదైనా సాధ్యమే అనిపిస్తోంది.

## రవిబాబు 'రేజర్'
# ట్రైలర్ విడుదల..

మే 8న థియేటర్లలోకి రానున్న యాక్షన్ థ్రిల్లర్!




**టాకీస్:** టాలీవుడ్ విలక్షణ నటుడు, దర్శకుడు రవిబాబు స్వీయ దర్శకత్వంలో ప్రధాన పాత్ర పోషిస్తూ రూపొందించిన చిత్రం 'రేజర్'. ఈ సినిమా మే 8న ప్రపంచవ్యాప్తంగా ప్రేక్షకుల ముందుకు రాబోతుండగా తాజాగా ట్రైలర్‌ను విడుదల చేసింది చిత్రయూనిట్. క్రైమ్ మరియు యాక్షన్ థ్రిల్లర్ నేపథ్యంలో తెరకెక్కిన ఈ సినిమా ట్రైలర్‌ను చూస్తుంటే.. ఈ చిత్ర కథాంశం ఒక చిన్నారి ప్రాణాలను కాపాడేందుకు ఓ వ్యక్తి శక్తివంతమైన రాజకీయ మరియు నేర వ్యవస్థతో చేసే పోరాటం చుట్టూ తిరుగుతుంది. తాజాగా విడుదలైన ట్రైలర్‌లో రవిబాబు అత్యంత భయంకరంగా, రా అండ్ రస్టిక్ లుక్‌లో కనిపిస్తూ సినిమాపై అంచనాలను పెంచేశారు. 'జీబర్‌అషెవ ఏఆశ్రీశ్రీ ఎవ ఎతీఙ్ఖశ్రీ' అనే ట్యాగ్‌లైన్‌కు తగ్గట్టుగా ట్రైలర్‌లోని యాక్షన్ సన్నివేశాలు చాలా ఉద్వేగభరితంగా మరియు హింసాత్మకంగా ఉండబోతున్నాయని స్పష్టమవుతోంది. గతంలో 'అవును', 'నచ్చావులే' వంటి వైవిధ్యమైన చిత్రాలను అందించిన రవిబాబు, ఈసారి కూడా ఒక సరికొత్త ప్రయోగానికి సిద్ధమయ్యారు. మరోవైపు ఈ చిత్రం విడుదల తేదీకి ఒక ప్రత్యేకత ఉంది. మే 8వ తేదీ రవిబాబు తండ్రి, దివంగత ప్రముఖ నటుడు చలపతిరావు గారి జయంతి కావడంతో, ఆయన జ్ఞాపకార్థం అదే రోజున సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకురావాలని నిర్ణయించారు. ఈ చిత్రాన్ని సురేష్ బాబు సమర్పణలో ఫ్లయింగ్ ఫ్రాగ్స్ మరియు సురేష్ ప్రొడక్షన్స్ సంయుక్తంగా నిర్మించాయి. రవిబాబు దర్శకత్వం వహించడమే కాకుండా కథను కూడా ఆయనే అందించారు. ఈ చిత్రానికి ఎస్.ఎస్. రాజేష్ సంగీతం అందించగా, చరణ్ మాధవనేని ఛాయాగ్రాహకుడిగా, సతీష్ పోలోజు యాక్షన్ కొరియోగ్రఫర్‌గా వ్యవహరించారు.

Printed , Published & Owned by GADDAMEDI BALARAJU, Printed, at YAGNA PRINTERS AND PUBLICATIONS # 18-105/4,Opp:SBI,Hanumanpet,Malkajgiri (M),Medchal-Malkajgiri District,Telangana State-500047 And Publishedat H. NO: 4-54-246,.Maqdum Nagar, Jagathgirigutta,IDA Jeedimetla,Balanagar Township,Medchal-Malkajgiri ,Telangana-500037 Editor : GADDAMEDI BALARAJU Cell: 9848802025 RNI.No. APTEL/2009/29786.